**కేరళలో చారిత్రాత్మక విజయం**
విజయంపై విజయ్‌కు రాహుల్ అభినందనలు



వివరాలు 2లో..

బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం, 05 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8

**బిజెపి కార్యకర్తల కఠోర శ్రమ ఫలితం**



వివరాలు 2లో..

## తమిళనాట మరోమారు సినీ ప్రభంజనం


- మామూలు నటుడి విశ్వరూప ప్రదర్శనం
- ఎంజిఆర్, జయలలిత తరవాత అంతటి విజయం
- సామాన్యుడిగా వచ్చి అసామాన్యుడి ఎదిగిన విజయ్



**చెన్నై,మే4 :** తమిళనాట మామూలు నటుడిగా కనిపించిన వ్యక్తి.. నేడు కోట్ల మంది గొంతుకగా మారి రాజకీయ రంగంలో పెను సంచలనం సృష్టించాడు. అభిమానుల గుండెల్లో 'దళపతి'గా ముద్ర వేసుకున్న జోసెఫ్ విజయ్.. ఇప్పుడు 'తమిళగ వెట్రి కళగం'(టీవీకే) జన నాయకుడిగా తన కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టేందుకు సిద్ధమ య్యారు. రీల్ లైఫ్ హీరో నుంచి రియల్ లైఫ్‌లో రాజకీయ నాయకుడిగా ఎంట్రీలోనే ప్రభంజనం సృష్టించారు విజయ్. గతంలో ఎంజిఆర్, జయలిత తరవాత ఇప్పుడు విజయ్ ఆ దిశగా ప్రయాణం మొదలయ్యిందనే చెప్పాలి. రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్ అనుకుని వెనకడుగు వేశారు. కమలహాసన్‌కు కలిసి రాలేదు. 1974 జూన్ 24న విజయ్ జన్మించారు. తల్లి శోభ గాయని, తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ దర్శకుడు. తొలినాళ్లలో కనీసం బాత్రూమ్ మిగతా 3లో..

# ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

- భారత రాజ్యాంగాన్ని బలపరచిన ఎన్నికలు
- భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసిన ఎన్నికలు
- బెంగాల్ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి
- గంగానది, బ్రహ్మపుత్రల ఆశీర్వాదమే ఈ విజయం
- అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొనడం ఈ ఎన్నికల విశేషం
- తమిళనాడు, కేరళ ప్రభుత్వాలకు అండగా ఉంటా
- విజయోత్సవంలో మోడీ



**న్యూఢిల్లీ,మే4 :** ఇవాళ భాజపా చరిత్ర సృష్టించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఐదు రాష్ట్రాల ప్రజలు భారత రాజ్యాంగాన్ని గెలిపించారని అన్నారు. ఇది ప్రజలకు నిజ మైన భరోసా ఇచ్చిన రోజు. బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి ప్రజలకు ధన్యవాదాలు. అని ప్రధాని అన్నారు. నాలుగు రాష్ట్రాలతో పాటు ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ప్రధాని మోదీ దిల్లీలోని భాజపా కార్యాలయానికి సంప్రదాయ పంచె కట్టుతో వచ్చారు. పశ్చిమబెంగాల్, అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంతో పార్టీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన విజయోత్సవ సంబరాల్లో ప్రధానమంత్రి పాల్గొన్నారు. మిగతా 3లో..

## బెంగాల్‌లో పాగా వేసిన బీజేపీ



- 205 సీట్లతో భారీ విజయం నమోదు
- మట్టి కరిచిన మమతా బెనర్జీ టీఎంసి
- వ్యూహాత్మక ప్రణాళికతో కాషాయదళం విజయం

మిగతా 2లో..

## టివికె గెలుస్తుందని ముందే చెప్పాం

- మా ఎగ్జిట్ పోల్స్ ఖచ్చింతంగా పనిచేసాయి
- మా అంచనాలను చాలామంది తప్పు పట్టారు
- యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా

మిగతా 2లో..

## బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు



- తెలంగాణలోనూ బిజెపి గెలుపు తథ్యం
- అత్యతంత ప్రతిష్టాత్మకంగా 10న ప్రధాని సభ
- ఎంపి ధర్మపురి అర్వింద్ వెల్లడి

3లో..

# రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- కొనుగోళ్లు లేక అన్నదాతల ఆగమాగం
- శనగ పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు ఏవీ
- సదాశివపేటలో రైతులను పరామర్శించిన కేటీఆర్



**సంగారెడ్డి,మే4 :** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుని చచ్చే వరకు వేధిస్తోం దని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. శనగ పంట వచ్చి.. నెల రోజులైనా ఇప్పటి వరకు ఆ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా ఇప్పటి వరకు సరిగా ఇవ్వలేదన్నారు. సోమవారం సం గారెడ్డి జిల్లా సదాశివపేటలో కేటీఆర్ మా ట్లాడుతూ.. అన్ని పంటలు కొనుగోలు చేస్తా మని చెప్పి రైతులను ఈ ప్రభుత్వంలోని నేతలు పచ్చి మోసం చేశారని విమర్శించారు. రాష్ట్రం లో ఏ పంట కూడా సరిగ్గా కొనుగోలు చేయ డం లేదంటూ ప్రభుత్వ తీరును ఈ సందర్భం గా ఆయన ఎండగట్టారు. 95 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు చేయాల్సి ఉండగా.. కేవలం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు ఇప్పటికి ప్రారంభించ లేదన్నారు. ధాన్యం దళారుల పాలు చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కేటీఆర్ కుండ బద్దలు కొట్టారు. సీఎం కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతు బంధు వేశారని కేటీఆర్ గుర్తు చేశారు. ధాన్యం కొనుగోలు చేయవద్దని ఈ ప్రభుత్వం ఆలోచన అని చెప్పారు. సివిల్ సప్లై కార్పొరేషన్‌లో భారీ కుంభకోణం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరోపించారు. అందుకే ఈ ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని వివరిం చారు. సీఎం, మంత్రులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడైనా సందర్శించారా..? అని ఈ సం దర్భంగా రైతులను ఆయన సూటిగా ప్రశ్నిం చారు. సీఎంకి భూముల కొనుగోళ్లు, రియల్ ఎస్టేట్‌పై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో వడదెబ్బ, పిడుగులు, గుండెపోటు తదితర కారణాలతో రైతులు చనిపోతుంటే ఈ ప్రభుత్వం పట్టిం చుకోవడం లేదని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ రాసి న లేఖతో రైతులపై ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందన్నారు. రాబోయే వారం రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాలు తిరిగి రైతులకు ధైర్యం చెబుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం



- జలుక్‌బరి నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో సిఎం గెలుపు

2లో..

## ముస్లింలకు రేవంత్ శుభవార్త

- హజ్ ఖర్చులను ప్రభుత్వం భరించేలా భరోసా



**హైదరాబాద్,మే4 :** తెలంగాణ ప్రభుత్వం హజ్ యాత్రికులకు గుడ్ న్యూస్ తెలిపింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో హజ్ యాత్ర ఖర్చులు భారీగా పెరిగాయి. ఈ అదనపు భారాన్ని పేద ముస్లిం సోదరులపై పడకుండా, ఆ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'హజ్ యాత్రికులకు అదనంగా అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుంది. ఈ నిర్ణయం వల్ల సుమారు 7 వేల మంది హజ్ యాత్రికులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ముస్లిం యాత్రికులకు ఈ నిర్ణయం ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. ముస్లిం సోదరులకు ప్రభుత్వం అండగా ఉంటుంది' అని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై రాష్ట్రంలోని హజ్ యాత్రికులు, మైనారిటీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రస్తుత రాజకీయాలపై జనం విసిగిపోయారు



- తమిళనాడు ఫలితమే ఇందుకు నిదర్శనం
- టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత పోస్ట్

**హైదరాబాద్,మే4 :** ప్రస్తుతం ఉన్న రాజకీయ వ్యవస్థలు, నాయకుల అధికార దాహంతో ప్రజలు విసిగిపోయారని, భ్రష్టు పట్టిన ఈ చరిత్రను మార్చడానికి కొత్త రాజ కీయ శక్తులు ఉద్భవించాల్సిన సమయం ఆసన్నమైందని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత పిలుపునిచ్చారు. తమిళనాడు ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాదని, అది దేశం మొత్తానికి ఒక బలమైన సంకేతమని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు ఉద్దేశం.. తెలంగాణలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనతో ప్రజలు విసిగిపోయారని భావిస్తున్న కవిత, తన కొత్త పార్టీని ఒక ప్రత్యామ్నాయ శక్తిగా ప్రజల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. తమిళనాడులో సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా వచ్చిన మార్పును ఉదహరిస్తూ, తెలంగాణలో కూడా అటువంటి మార్పు అనివార్యమని కవిత పరోక్షంగా హెచ్చరించారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న పార్టీలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని.. అందుకే ప్రజలు ఇప్పుడు కొత్త గొంతుక కోసం ఎదురు చూస్తున్నారని ఆమె ఈ పోస్ట్ ద్వారా చెప్పుకొచ్చారు. పాత రాజకీయ శక్తుల వల్ల వ్యవస్థ దెబ్బతిందని, దానిని ప్రక్షాళన చేయాలంటే సరికొత్త సిద్ధాంతాలతో కూడిన నాయకత్వం రావాలని ఆమె బలంగా విశ్వసిస్తున్నారు. తన పార్టీ 'తెలంగాణ రక్షణ సేన' కొత్తది కావడం వల్ల, ప్రజలు తమకు ఒక్క అవకాశం మిగతా 3లో..

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు

- అసోం, పుదుచ్చేరిల్లో అధికారం నిలబెట్టుకున్న బీజేపీ
- బెంగాల్లో పాగా వేసిన బీజేపీ..మట్టి కరిచిన మమతా బెనర్జీ
- కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడిఎఫ్ విజయం
- తమిళనాట విజయ్ కొత్త కెరటం



**న్యూఢిల్లీ,మే4 :** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా వచ్చాయి. అసోం, పుదు చ్చేరిలో అధికారం నిలుపుకున్న బిజెపి, బెంగాల్లోనూ విజయభేరి మోగించింది. కేరళలో కాంగ్రెస్ నేతృత్వ ంలోని యూడిఎఫ్ విజయం సాదించింది. తమిళనాట విజయ్ నేతృత్వంలోని టివికె అనూహ్యంగా దూసు కుని వచ్చింది. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ హవా కొనసాగింది. డీఎంకే, అన్నాడీఎంకేను దాటి ఆధిక్యంలో కొనసాగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు మిగతా 3లో..

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# కేరళలో మూడు సీట్లు గెల్చుకున్న బీజేపీ



తిరువనంతపురం,మే4 : కేరళలో పదేళ్ల తర్వాత భాజపా ఖాతా తెరచింది. నేమోం, చాతన్నూర్, కాళకూటం అసెంబ్లీ నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. తమకు ఒక్క సీటు కూడా రాదని కాంగ్రెస్, సీపీఎంలు చేసిన వ్యాఖ్యలకు ఈ ఫలితాలే సమాధానమని కాషాయ పార్టీ కేరళ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తాను పోటీ చేసిన కంజిరప్పల్లిలో మూడో స్థానంలో నిలిచారు. నేమోం స్థానంలో రాజీవ్ చంద్రశేఖర్ తన సమీప అభ్యర్థిపై 4,978 ఓట్ల తేడాతో గెలు పొందారు. చాతన్నూర్‌లో బీబీ గోపకుమార్ 4,398 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాళకూటంలో కేంద్ర మాజీ మంత్రి వి.మురళీధరన్ 428 ఓట్ల తేడాతో గ్టటెక్కారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి భాజపా తొలిసారి 2016లో ఓ సీటు సాధించింది. నేమోం నియోజకవర్గం నుంచి సీనియర్ నేత రాజగోపాల్ గెలిచారు. 2021లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాలేదు. కేరళలో మొత్తం 140 స్థానాలు ఉండగా.. తాజా ఫలితాల్లో 102 స్థానాల్లో విజయంతో యూడీఎఫ్ సెంచరీ కొట్టినట్లయ్యింది. 2021 ఎన్నికల్లో 62 స్థానాల్లో గెలిచిన ఎల్డీఎఫ్.. ఈ సారి 35కే పరిమితమైంది. ధర్మదం నుంచి పోటీ చేసిన సీఎం పినరయి విజయ్ 19,247 ఓట్ల తేడాతో గెలుపొందారు.

# అసోంలో బిజెపి హ్యాట్రిక్ విజయం

- జలుక్‌బరి నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో సిఎం గెలుపు



గువాహటి,మే4 : అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. 126 స్థానాలు ఉన్న అసోంలో బిజెపి వందకు పైగా సీట్లను గెల్చుకుని తిరుగులేదని నిరూపించింది. ఇక్కడ కాంగ్రెస్ నేత గోగోయ్ అపజయం పాలయ్యారు. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. హిమంత సైతం తన సొంత నియోజక వర్గమైన జలుక్‌బరి అసెంబ్లీ నియో జకవర్గం నుంచి 89,000 పైచిలుకు ఓట్లతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన బిదిష నియోగ్‌కు 31,951 ఓట్లు పోలయ్యాయి. హిమంత బిశ్వ శర్మ 2015లో కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 2021 నుంచి అస్సాంలో బీజేపీకి కీలకనేతగా నిలిచారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులను వ్యతిరేకిం చడం, ఆదివాసీ భూములను చొరబాటుదారుల నుం చి విముక్తి కలిగించడంతో ముఖ్యమంత్రిగా అన్ని ప్రధాన వర్గాలుగా చేరువయ్యారు. ముఖ్యంగా చికెన్‌నెక్ కారిడార్‌పై బంగ్లా ప్రకటనలు తిప్పి కొట్టడం, బెలూచిస్థాన్ స్వాతంత్ర పోరాటానికి మద్ద తుగా నిలవడం, అసాంలో వరద నివారణ చర్యలు తీసుకోవడం వంటి చర్యల ద్వారా ప్రజల ఆదరాభి మానాలు చూరగొన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బంగ్లా చొరబాట్లకు పూర్తి అడ్డుకట్ట వేస్తామని, ఎన్‌ఆర్‌సీని కచ్చితంగా అమలవుతుందని ఆయన చేసిన ప్రచారం ఓటర్లను ఆకట్టుకుంది. ప్రధాన మంత్రి మోదీ సైతం హిమంత్ బిశ్వ శర్మ ప్రచారానికి దన్నుగా నిలవడంతో అస్సాంలో బీజేపీ తిరుగులేని విజయాన్ని మరోసారి సొంతం చేసుకుంది.

# ఉప ఎన్నికల్లోనూ బీజేపీ హవా




## ఏడింటిలో నాలుగు కైవసం

న్యూఢిల్లీ,మే4 : దేశంలో ఐదు రాష్ట్రాలకు సంబంధించిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలోనే దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లోనూ బిజెపి సత్తా చాటింది. ఆయా రాష్ట్రాల్లోజరిగిన 7 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలూ వెలువడ్డాయి. ఈ ఏడాది జనవరిలో విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌తో సహా ఆయా సిట్టింగ్ ఎమ్మెల్యేలు మృతిచెందడం వల్ల ఈ ఉప ఎన్నికలు అనివార్యమ య్యాయి. మహారాష్ట్రలో రాహురి, బారామతి; కర్ణా టకలో బాగల్‌కోట్, దావణగెరె సౌత్; గుజరాత్‌లో ఉమ్రత్, నాగాలాండ్‌లో కోరిడాంగ్, త్రిపురలో ధర్మనగర్‌లో ఈ ఉప ఎన్నికలు జరిగాయి. తాజాగా వీటి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఈ ఏడింట్లో నా లుగు స్థానాల్లో భారతీయ జనతా పార్టీ జయకేతనం ఎగురవేయగా.. మరో మూడింట్లో కాంగ్రెస్ గెలుపొందింది.మహారాష్ట్రలో ఉన్న బారామతి అసెంబ్లీ స్థానం..రాజకీయ పలుబడి ఉన్న పవార్ కుటుంబానికి కంచుకోట. సిట్టింగ్ ఎమ్మెల్యే అజిత్ పవార్ జనవరి 28న జరిగిన విమాన ప్రమాదంలో మరణించడంతో ఆ స్థానంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఆయన భార్య, నేషనలిస్ట్ కాంగ్రెస్ అజిత్ వర్గం అభ్యర్థి సునేత్ర అజిత్ పవార్ ఆ స్థానం నుంచి పోటీ చేశారు. 2,18,034 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. మరో స్థానం రాహురిలో కాంగ్రెస్ అభ్యర్థి గోవింద్ మొకాతెపై 1,12,587 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి అక్షయ్ శివాజీరావ్ ఘన విజయం సాధించారు. ఇక.. కర్ణాటకలోని బాగల్ కోట్‌లో కాంగ్రెస్ నేత ఉమేశ్ హుళ్లప్ప మేటి 22,332 ఓట్ల తేడాతో బీజేపీపై గెలుపొందారు. బీజేపీ తరఫున చరన్‌మితత్ వీరభద్రయ్య(వీరన్న) పోటీ చేశారు. కర్ణాటకలోని దావణగెరె సౌత్‌లోనూ కాంగ్రెస్ విజయ దుందుభి మోగించింది. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస టి.దాసకరియప్పపై 5,708 ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి సమర్థ్ మల్లికార్జున విజయం సాధించారు.గుజరాత్‌లోని ఉమ్రత్‌లో బీజేపీ అభ్యర్థి హర్షత్‌భాయ్ గోవింద్‌భాయ్ పర్మార్ 30,743 ఓట్ల తేడాతో కాంగ్రెస్ నేత భృగురాజ్ సింగ్ చౌహాన్‌పై ఘన విజయం సాధించారు. హర్షద్ పర్మార్‌కు 85,500 ఓట్లు రాగా, భృగురాజ్‌కు 54,757 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీ ఎమ్మెల్యే గోవింద్ పర్మార్ మృతిచెందిన కారణంగా ఈ ఉప ఎన్నిక జరిగిన విషయం తెలిసిందే. అక్కడ గోవింద్ కుమారుడు, హర్షత్ భాయ్ విజయం సాధించడం విశేషం. నాగాలాండ్‌లోని కోరిడాండ్‌లో బీజేపీ అభ్యర్థి దావోచియర్ ఐ.ఇమ్‌చన్, ఇండిపెండెంట్ అభ్యర్థి తోషికాబా మధ్య గట్టి పోటీ నెలకొంది. ఇందులో ఇండిపెండెంట్ అభ్యర్థి తోషికాబాపై 3,123 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి దావోచియర్ గెలుపొందారు. త్రిపురలోని ధర్మనగర్‌లో సీపీఐ(మార్క్సిస్ట్) అభ్యర్థి అమితాబ్ దత్తపై 18,290 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి జహర్ చక్రబరోటి విజయం సాధించారు.

# బిజెపి కార్యకర్తల కఠోర శ్రమ ఫలితం



బెంగాల్ విజయంపై ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్ట్

న్యూఢిల్లీ,మే4 : పశ్చిమబెంగాల్‌లో బీజేపీకి విజయం దక్కిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. రాష్ట్ర బీజేపీ కార్యకర్తలను అభినందించారు. వారి కఠోర శ్రమ వల్లే ఈ విజయం సాధ్యమైందని అన్నారు. ఈ ఎన్నికలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెప్పారు. మంచి పాలన అందించాలన్న బీజేపీ అభిమతమే అంతిమంగా పైచేయి సాధించిందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. పశ్చిమ బెంగాల్ ప్రజలు బీజేపీకి అద్భుతమైన విజయాన్ని అందించారని ప్రధాని మోదీ అన్నారు. ఈ విజయం కోసం రాష్ట్రంలో పార్టీకి చెందిన కొన్ని తరాల కార్యకర్తలు నిరంతరం శ్రమించారని ప్రశంసించారు. కొన్నేళ్ల పాటు క్లిష్ట పరిస్థితుల్లో పోరాడారని అన్నారు. కార్యకర్తలే పార్టీ శక్తి అని కొనియాడారు. ప్రతి ఒక్క కార్యకర్తకూ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. బీజేపీకి మర్చిపోలేని విజయం అందించినందుకు రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ తాను శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని కూడా ప్రధాని మోదీ చెప్పారు. రాష్ట్ర ప్రజల ఆశలను, కలలను సాకారం చేసేందుకు బీజేపీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకూ అవకాశాలు, గౌరవం దక్కేలా పాలన అందిస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

# బెంగాల్‌లో పాగా వేసిన బీజేపీ

**205 సీట్లతో భారీ విజయం నమోదు**
**మట్టి కరిచిన మమతా బెనర్జీ టీఎంసి**
**వ్యూహాత్మక ప్రణాళికతో కాషాయదళం విజయం**



కోల్‌కతా,మే4 : బెంగాల్ దంగల్‌లో బిజెపి గెలిచింది. అనుకున్నట్లుగానే మమతను మట్టి కరిపించింది. టీఎంసీ కంచుకోటను భాజపా బద్దలు కొట్టింది. 15 ఏళ్లుగా ఎదురులేకుండా బెంగాల్‌ను పాలించిన మమతా బెనర్జీకి గట్టి షాకిచ్చింది. గత రెండు దఫాల్లో సాధ్యంకాని విజయం ఈ సారి కమలనాథుల వశమైంది. పశ్చిమబెంగాల్ లో అనుసరించిన పదునైన వ్యూహం ఈసారి పార్టీకి కచ్చితమైన ఫలితాన్ని తీసుకొచ్చింది. భాజపా అగ్రనేత అమిత్‌షా అన్నీ తానై ఈ ఎన్నికల్లో పార్టీని నడిపించారు. మొత్తం 293 స్థానాల్లో 205 స్థానాల్లో బిజెపి ఘన విజయం సాధించింది. మమతా బెనర్జీ పార్టీ 85 స్థానాలకు పరిమితం అయ్యింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అంచనాలను తలకిం దులు చేస్తూ మమతా బెనర్జీ సత్తా చాటారు. నాడు భాజపా 10,000 కంటే తక్కువ ఓట్ల తేడాతో 40 స్థానాలు, 5,000 కంటే తక్కువ ఓట్లతో 20 స్థానాలు కోల్పోయి 77 స్థానాలకే పరిమితమైంది. దీంతో దీదీని ఓడించడం అంత సులువు కాదని గ్రహించిన భాజపా వ్యూహాన్ని మార్చుకొంది. సునీల్ భన్సల్ పార్టీ ఇన్‌ఛార్జిగా.. వ్యవస్థీకృత మార్పులు తీసు కొచ్చారు. అమిత్‌షాకు భన్సల్ నమ్మకస్తుడని పేరు. టికెట్ల పంపిణీ విషయంలో సెలబ్రిటీలు, ఫిరాయింపుదార్లకు ప్రా ధాన్యం ఇవ్వకుండా క్షేత్రస్థాయిలో పట్టున్న పార్టీ నాయ కులకు భాజపా పెద్దపీట వేసింది. ప్రతి బూత్‌స్థాయిలో 300 ఓట్లను సమీకరించగల వారికే టికెట్లు కేటాయిం చిం ది. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన చోట్ల పుంజుకోవడానికి బూత్ స్థాయి మేనేజ్‌మెంట్‌కు తెరతీసింది. పోలింగ్ కేంద్రాల్లో బలమైనవి, దృష్టిపెట్టాల్సినవి, బలహీనమైనవి అంటూ మూడు వర్గీకరణలు చేసింది. ఇక్కడే 'పన్నా ప్రముఖ్' వ్యవస్థ పనిచేసింది. ప్రతి కార్యకర్త 10-15 కుటుంబాలతో సత్సంబంధాలు నెరిపి 30-60 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా చేశారు. దీంతోపాటు భాజపా 'శక్తికేంద్రాలు'గా వర్గీకరించుకొన్న క్లస్టర్ల నుంచి అధిక పోలింగ్ ఉండేలా నిర్దేశించారు. ఇక అమిత్‌షానే స్వయంగా 152కు పైగా నియోజకవర్గాల్లోని 44,000 పోలింగ్ కేం ద్రాల పరిధిలో జరిగిన సమావేశాలను పర్యవేక్షించారంటే భాజపా ఏ స్థాయిలో దృష్టిపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. పన్నా ప్రముఖ్ నెట్‌వర్క్‌ను సునీల్ భన్సల్ చూసుకోగా.. బూత్ స్థాయి సమన్వయ బాధ్యతలను భూపేంద్ర యాదవ్ స్వీకరించారు. ఫలితంగా బెంగాల్‌లో రికార్డ్ స్థాయిలో దాదాపు 92శాతం పోలింగ్ నమోదైంది. ఇది భాజపాకు కచ్చితంగా కలిసొచ్చింది. బూత్‌స్థాయి సమావేశాల్లో కార్య కర్తలు మమత సర్కారు వైఫల్యం, శాంతి భద్రతల పరిస్థితి, బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు, ఆర్జీకర్ ఆస్పత్రిలో వైద్యురా లిపై హత్యాచారం వంటివి ప్రస్తావించారు. ఇక ఆర్జీకర్ ఆస్పత్రి వైద్యురాలి తల్లికి కూడా పానిహటి నుంచి భాజపా టికెట్ కేటాయించి.. ఆ అంశాన్ని ప్రచారంలోకి తీసుకొ చ్చింది. దీంతో మమతా విజయావకాశాలను దెబ్బకొట్టిన ట్లయ్యింది. పశ్చిమ బెంగాల్‌లో 70శాతం ఉన్న హిందూ ఓటర్ల ఏకీకరణేలి లక్ష్యంగా భాజపా పనిచేసింది.

# తమిళనాట విజయ్ పార్టీ విజయం ఖాయం

- ఏడాది క్రితమే జోస్యం చెప్పిన ప్రశాంత్ కిషోర్
- ఆనాటి వీడియో సోషల్ మీడియాలో వైరల్



న్యూఢిల్లీ,మే4 : తమిళనాడులో విజయ్ టీవీకే 98 నుంచి 120 సీట్లు గెలుస్తుందని గత ఏడాది మార్చిలో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ ముందే జోస్యం చెప్పారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దళపతి విజయ్ తాజాగా సునామీ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన గెలుపు ఖాయమని ఏడాది క్రితమే ప్రశాంత్ కిషోర్ చెప్పిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'ఈ వీడియో దాచి పెట్టుకోండి. ఫలితాల తరువాత ప్లే చేయండి' అని ఆ వీడియోలో ప్రశాంత్ కిషోర్ సవాలు విసిరారు. ప్రశాంత్ కిషోర్ గత ఏడాది మార్చిలో తంతి టీవీ కి ఇంటర్వ్యూ ఇచ్చారు. టీవీకే ఆవిర్భావం జరిగి అప్పటికి ఏడాది అయింది. తమిళ సూపర్‌స్టార్, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ విజయావకాశాలపై అడిగిన ప్రశ్నకు ప్రశాంత్ కిషోర్ సూటిగా సమాధానమిచ్చారు. విజయ్ ఒంటరిగా ఎన్నికల బరిలోకి వెళ్లాలని పట్టుదలగా ఉన్నారని, అందులో మార్పు ఉంటుందని తాను అనుకోనని చెప్పారు. ఒంటిరిగా ఎన్నికల్లోకి వెళ్తే తమిళ నాడులో ఆయన విజయం సాధిస్తారని అన్నారు. విజయానికి అవసరమైన 118 సీట్ల కంటే ఎక్కువే సాధిస్తా రని పేర్కొన్నారు. 'ఈ వీడియాను దాచిపెట్టుకోండి... ఫలితాల తరువాత ప్లే చేయ ండి' అని కూడా ఆయన ఢంకా బజాయించారు. ప్రశాంత్ కిషోర్ 'ఐ-ప్యాక్' పొలిటికల్ స్ట్రాటజీ సంస్థ తమిళనాడులో టీవీకేతో కలిసి పనిచేసిందనే వార్తలు కూడా వచ్చాయి. విజయ్‌తో ఉన్న అసోసియేషన్‌ను ఆ ఇంటర్వ్యూలో ప్రశ్నించిన ప్పుడు, తాము రాజకీయ సహచరుల కంటే మంచి మిత్రుల మని అన్నారు. ఐదేళ్ల క్రితం తొలిసారి తాము మా ట్లాడుకున్నామని, ఆయనకు తాను రాజకీయ సలహాదారు కాదని, సిద్ధాంతాలు, విలువలపై అభి ప్రాయాలు పంచుకుంటూ ఉంటామని చెప్పారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,మే4 : బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. సోమవారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,920గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,340గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,51,220గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,490గా ఉంది. రోవైపు వెండి ధరలు కూడా స్వల్పంగా తగ్గాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గుదల నమోదు చేశాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,69,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,69,900గా, బెంగళూరులో రూ.2,64,900గా ఉంది.

# టివికె గెలుస్తుందని ముందే చెప్పాం

- మా ఎగ్జిట్ పోల్స్ ఖచ్చింతంగా పనిచేసాయి
- మా అంచనాలను చాలామంది తప్పు పట్టారు
- యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా



న్యూఢిల్లీ,మే4 : తమిళనాట తొలిసారిగా అసెం బ్లీ ఎన్నికల బరిలో నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీ ప్రస్తుతం 100కు పైగా స్థానాల్లో ఆధి క్యంలో ఉంది. అధికారాన్ని నిలబెట్టుకుంటుందని అనుకున్న డీఎమ్‌కే మాత్రం వెనుకంజలో ఉంది. ఈ నేపథ్యంలో యాక్సిస్ మై ఇండియా చీఫ్ ప్రదీప్ గుప్తా సోమవారం జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే పార్టీ 98కి పైగా స్థానాల్లో గెలుస్తుందని తాము ఎగ్జిట్ పోల్స్‌లో అంచనా వేస్తే అంతా నవ్వారని అన్నారు. కానీ చివరకు తమ అంచనాలే నిజమవుతున్నాయని చెప్పారు. అయితే, ఈ విజయం తమది కాదని, డేటా సైన్స్‌ది అని ఆయన వ్యాఖ్యానించారు. 'టీవీకే విజయంపై మా అంచనాను దేశవ్యాప్తంగా ఎవ్వరూ నమ్మలేదు. అలా జరగదని అంటూ మా అంచనా ను కొట్టిపారేశారు. రాజకీయ విశ్లేషకులు, పరిశీలకులు, ఇతర పోలింగ్ ఏజెన్సీలు అంతా మమ్మల్ని చూసి నవ్వారు' అని అన్నారు. డీఎమ్‌కే ప్రభావాన్ని యాక్సిస్ మై ఇండియా ఎక్కువగా అంచనా వేసిందా? అన్న ప్రశ్నకు గుప్తా స్పందిస్తూ డీఎమ్‌కేకు 35 శాతం ఓట్లు రావచ్చని తాము భావించినట్లు చెప్పా రు. ప్రస్తుతం 32 శాతంగా ఉందని అన్నారు. ఇక తమ అంచనాకు అనుగుణంగా టీవీకే ఇప్పటివరకూ 35 శాతం ఓట్లు సాధించిందని చెప్పారు. అన్నాడీఎమ్‌కేకు 23 శాతం ఓట్లు వస్తా యని తాము అంచనా వస్తే ప్రస్తుతం వారి వాటా 27 శాతంగా ఉందని అన్నారు. రెండో స్థానంలో స్టాలిన్, మూడో స్థానంలో పళనిస్వామి ఉంటారని తాము నమ్ముతున్నామని అన్నారు. ఫలితాలు వెలువడ్డాక పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. యువతరం విజయ్‌కు మద్దతు పలకడంతో టీవీకే విజయబావుటా ఎగురవేసిందని చెప్పారు. 18 ఏళ్ల నుంచి 39 ఏళ్ల మధ్య ఉన్న వారు విజయ్‌కు పట్టం కడతారని తాము అంచనా వేశామని అన్నారు. ఈ వయసుల్లోని వారి వాటా తమిళనాడులో 42 శాతంగా ఉందని అన్నారు. 40 ఏళ్లు పైబడిన వారు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే విజయ్‌కు జైకొట్టారని అన్నారు. అత్యధిక శాతం మహిళల ఓట్లు దక్కించుకున్న పార్టీగా డీఎమ్‌కే తరువాత టీవీకే నిలుస్తుందని కూడా చెప్పారు. తమిళనాట మేజిక్ ఫిగర్ అయిన 118 స్థానాలను టీవీకే గెలుచుకోలేని పక్షంలో పార్టీ అధినేత విజయ్ ఏం చేస్తారన్న దానిపై ప్రస్తుతం సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# కేరళలో రేవంత్ ప్రచారం పనిచేసింది

**వ్యూహాత్మకంగా ప్రచార సరళి**
**కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్ గౌడ్**
**తదితరుల ప్రశంసలు**

హైదరాబాద్,మే4 : కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ ఘన విజయం సాధించడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక విజయమని పేర్కొన్నారు. కేరళలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, నాయకులు ప్రచారం నిర్వహించడం.. తెలంగాణ పాలన చూసి ఓట్లు వేయాలని కోరడం చాలా ప్రభావం చూపించిందన్నారు. కేరళలో విజయం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని.. మరోసారి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగించిందని వెల్లడించారు. తమిళనాడులో మెజారిటీ స్థానాలు గెలుచుకున్న టీవీకే అధినేత విజయ్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఐదు అసెంబ్లీల ఎన్నికల ఫలితాలపై ఇండియా కూటమి సమీక్ష చేసి.. మరింత బలోపేతం అయ్యేందుకు చర్యలు చేపడుతుందని తెలిపారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ విజయం సాధించింది. ఈ విజయం వెనక తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు ఉన్నాయని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. యూడీఎఫ్ విజయంలో సీఎం రేవంత్ రెడ్డి క్రియాశీలకంగా వ్యవహరించారని పేర్కొన్నారు. కేరళ సీఎం విజయన్‌పై.. రేవంత్ రెడ్డి నేరుగా విమర్శలు ఎక్కుపెట్టారని గుర్తు చేశారు. కేరళ అభివృద్ధిపై విజయన్‌ను నిలదీయడం తోపాటు లేఖలు కూడా రాశారని పేర్కొన్నారు. అదే సమయంలో తెలంగాణలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కేరళ ప్రచారంలో రేవంత్‌రెడ్డి వివరించారన్నారు. ఒక్క డైలాగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల దశను మార్చారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ కొనియాడారు. ఆయన బ్రాండ్ కేరళలో ఉపయోగపడిందన్నారు. విజయన్ టైం అయిపోయిందని రేవంత్ ముందే చెప్పారని గుర్తు చేశారు. కేరళ ఎన్నికల్లో ఆయన ప్రసంగాలు పార్టీ అభ్యర్థుల విజయాలకు దోహదపడ్డాయన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆ రాష్ట్ర ప్రజలను తన ప్రసంగాలతో ఆకట్టుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కేరళ ప్రజలకు వివరించారన్నారు.

# మూడు రాష్ట్రాల్లో ఎన్‌డిఎ విజయం

**ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు**
**హర్షం వ్యక్తం చేసిన మంత్రి లోకేశ్**
**తమిళనాడు విజయ్‌కు అభినందనలు**

అమరావతి,మే4 : అస్సాం, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకే శ్ స్పందించారు. ఎన్నికల్లో ఎన్డీఏకు లభించిన విజయాన్ని స్వాగ తిస్తూ లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టి ఎన్డీఏకు హృదయపూర్వక అభినం దన లు తెలిపారు. అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో వచ్చిన ఎన్నికల ఫలితాలు అభివృద్ధి, స్థిరత్వం, నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రజలు ఉంచినవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని మంత్రి లోకేశ్ పేర్కొ న్నారు.దేశవ్యాప్తంగా ప్రజలు అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని కోరుకుంటున్నారని మంత్రి లోకేశ్ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం వేగం, విస్తృత స్థాయి, పారదర్శకతతో కూడిన అభివృద్ధి వైపు సాగుతోందని వెల్లడి ంచారు. ఈ ఎన్నికల ఫలితాలు ఆ దిశగా ప్రజల మద్దతును మరిం త బలపరిచాయని చెప్పారు. అభివృద్ధి, అవకాశాలు, సమగ్ర ప్రగతి లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారతదేశానికి బలమైన మద్దతుగా ఈ తీర్పు నిలిచిందని మంత్రి లోకేశ్ అన్నారు. మరోవైపు తమిళ నాడు ఎన్నికల్లో విజయం వైపు దూసుకెళ్తున్న టీవీకే పార్టీ అధినేత విజయ్‌కు కూడా మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. 'తమిళనాడులో అద్భుతమైన తొలి ఎన్నికల విజయం సాధించిన విజయ్‌కు అభినందనలు.ఈ ఫలితం రాష్ట్ర ఓటర్ల మారుతున్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, దాని రాజకీయ ముఖచిత్రానికి ఒక కొత్త కోణాన్ని అందిస్తోంది. ఆయన ప్రజా జీవితంలోకి అడుగు పెడుతూ బాధ్యత, నిబద్ధతతో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా కృషి చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అంటూ పోస్టు పెట్టారు.

# జవహర్ డంపింగ్ యార్డును తొలగించండి

సిఎంను కోరిన ప్రజాప్రతినిధులు

హైదరాబాద్,మే4 :జవహర్ నగర్ డంప్ యార్డును తరలించాలాలని సీఎం రేవంత్‌ను పలువురు ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేసారు. ఇక్కడి చెత్తను తొలగించి చుట్టుపక్కల ప్రజలకు విముక్తి కలిగించాల న్నారు. డంప్ యార్డును తొలగిస్తామన్న వాగ్దానాన్ని వారు గుర్తు చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని యాంటీ జవహర్ నగర్ డంప్ యార్డ్ జెఎసి కలిసింది. సీఎంను కలిసిన వారిలో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జెఏసి కన్వీనర్ శంకర్ నారాయణ్, ఇతర జెఏసి నాయకులు అన్నారు. సమస్య తీవ్రత తెలుసని, పరిష్కారం ఆలోచిస్తున్నామని సిఎం అన్నారు.

# పిడుగుపాటుకు బాలిక దుర్మరణం

అల్లూరి సీతారామరాజు,మే4 : డుంబ్రిగుడ మండలంలో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. భారీ వర్షాల కారణంగా పిడుగుపాటుకు గురై బాలిక మృతిచెందింది. ఖంద్రూం పంచాయతీ సింధేరిగూడలో ఈరోజు (సోమవారం) మధ్యాహ్నం మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం మొదలవ్వడానికి ముందే గ్రామానికి సమీపంలోని కొండకు కొంకోడి కూర సేకరించేందుకు సొంగుల దివ్య (13) వెళ్లింది.తన అక్క, మరో ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి కొండపైకి వెళ్లింది. కొంకోడి కూర సేకరణ అనంతరం తిరుగు ప్రయాణంలో గ్రామానికి వస్తుండగా పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగుపాటుకు గురై దివ్య ప్రాణాలు కోల్పోయింది. దీంతో చిన్నారిని కొండ పైనుంచి స్నేహితులు మోసుకొచ్చారు. ఈ ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. మరోవైపు సింధేరిగూడలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# (మొదటిపేజీ తరువాయి)

## ఐదు రాష్ట్రాల్లో చారిత్రక ఎన్నికలు

బెంగాలీ ధోతితో విచ్చేసిన ప్రధానికి పార్టీ అగ్రనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. 'మోదీ మోదీ' నినాదాలతో కార్తకర్తలు హోరెత్తించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బెంగాల్ బీజేపీ విజయంతో శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆత్మకు ఉపశమనం కలిగిందన్నారు. పార్టీ కార్యకర్తల సంబరాల్లో నేనూ పాల్గొంటున్నా. బెంగాల్‌లో 93 శాతం పోలింగ్‌తో సరికొత్త రికార్డు సృష్టించారు. తమిళనాడు, కేరళలోనూ పోలింగ్ శాతం బాగా పెరిగింది. దేశంలో 20కిపైగా రాష్ట్రాల్లో భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నాయి. గంగానది ప్రవహించే ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకూ నెగ్గాం. గంగానది ఆశీర్వాదం వల్లే ఈ విజయాలు దక్కాయి. బ్రహ్మపుత్ర ఆశీర్వాదం వల్ల అస్సాంలోనూ హ్యాట్రిక్ సాధించాం. పుదుచ్చేరిలో 2021లో ఇచ్చిన హామీలను మేం నెరవేర్చాం. బెంగాల్‌లో గెలుపుతో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆత్మకు శాంతి లభిస్తుంది. ఇక నుంచి బెంగాల్‌లో భయాందోళనలు ఉండవని ప్రకటించారు. సుపరిపాలన అందించినందుకే ప్రజలు మాకు పట్టం కట్టారు. తమ రాష్ట్రాలు అభివృద్ధి చెందాలంటే భాజపా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా అంటేనే అభివృద్ధి.. సంక్షేమం అని మోదీ పేర్కొన్నారు.బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అసాధారణమైన, చారిత్రక తీర్పునిచ్చారని, ఆ ఆనందం కార్యకర్తల కళ్లలో స్పష్టంగా కనిపిస్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. బెంగాల్‌లో నూతన చరిత్రను ఆవిష్కరించిన బీజేపీ కార్యకర్తలను అభినందించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ బాధ్యతలు చేపట్టాక ఆయన మార్గదర్శకంలో జరిగిన తొలి ఎన్నికలు ఇవంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకూ ప్రతిచోట కమలం వికసించిందని, కామాక్ష అమ్మవారి ఆశీర్వచనం పుష్కలంగా లభించిందని చెప్పారు. అభ్యుదయ బెంగాల్ కోసం ఆయన కలలుగన్నారని, అది ఇన్నేళ్ల తర్వాత వాస్తవరూపం దాల్చిందని పేర్కొన్నారు. బెంగాల్ ప్రజలు బీజేపీకి ఒక అవకాశం ఇచ్చారని చెప్పారు. బెంగాల్‌లో మార్పుకోరుతూ పవనాలు బలంగా వీచాయని పేర్కొన్నారు. బీజేపీ అంటేనే సుపరిపాలన అనే విషయం ప్రజలకు బాగా తెలుసునని ప్రశంసించారు. స్సాంలో బీజేపీ-ఎన్డీయేను ప్రజలు మరోసారి ఆశీర్వదించారని, అభివృద్ధికి ప్రజలు బాసటగా నిలిచారని ప్రధాని

కొనియాడారు. తిరుగులేని తీర్పునిచ్చిన అస్సాం ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సర్వోతో ముఖాభివృద్ధికి భరోసాగా ఉంటామన్నారు. దశాబ్దాలుగా పార్టీ, కూటమి ఎదుగుదలకు అవిశ్రాంతంగా కృషి చేసిన బీజేపీ-ఎన్డీయే కార్యకర్తలను అభినందించారు. ముఖ్యమంత్రి ఎన్.రామస్వామి సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం టాక్ రికార్డు, సుపరిపాలనకు మరోసారి పట్టం కట్టిన పుదుచ్చేరి ప్రజలకు మోదీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యకర్తలకు అభినందనలు చెప్పారు. కేరళలో విజయం సాధించిన యూడీఎఫ్‌కు ప్రధానమంత్రి అభినందనలు తెలిపారు. బీజేపీ-ఎన్డీయేకు ఓటు వేసిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కేరళ ప్రగతి కోసం, వికసిత కేరళం విజన్ సాకారం కోసం తాము పనిచేస్తామని చెప్పారు. కేరళం ప్రజల అభివృద్ధి ఆకాంక్షలకు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందన్నారు. తమిళనాడులో మంచి ఫలితాలు సాధించిన విజయ్ టీవీకేను ప్రధాని అభినందించారు. ఎన్డీయేకు మద్దతుగా

## తమిళనాట మరోమారు సినీ ప్రభజంనం

కూడా లేని చిన్న గదిలో విజయ్ తల్లిదండ్రులు నివాసం ఉండేవారు. అతడికి ఏడేళ్లు వచ్చేవరకు ఆర్థికంగా సతమతమవుతూనే ఉండేది ఆ కుటుంబం. ఆ తర్వాతే విజయ్ తల్లిదండ్రులు విజయ్‌కాంత్‌తో 'చట్టం ఒరు ఇరుట్టరై' తీశారు. ఈ సినిమా సూపర్ హిట్ అయింది. దీంతో వీరు ఆర్థికంగా స్థిరపడ్డారు. విజయ్ చిన్నప్పుడు చాలా అల్లరి చేసేవాడు. ఎప్పుడూ నవ్వుతూ, అందరినీ ఆట పట్టించేవాడు. కానీ, ఆయన సోదరి మరణం విజయ్ జీవితాన్ని మార్చేసింది. తన చెల్లి విద్య అంటే విజయ్‌కు ప్రాణం. ఆమె చనిపోయిన తర్వాత విజయ్ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారిపోయారు. నేటికీ ఆయన తెరపై అంత ఎనర్జీతో కనిపిస్తున్నా.. బయట మాత్రం చాలా మితభాషిగా ఉండటానికి ఆనాటి విషాదమే కారణమని విజయ్ తండ్రి చంద్రశేఖర్ చెబుతుంటారు.

చిన్నప్పటి నుంచి తండ్రిని చూసిన విజయ్ దృష్టి సినిమాల వైపు మళ్లింది. కానీ, 'మీవాడు హీరో ఏంటండీ, అసలు నటుడిగానే పనికిరాడు... బండమొహం వాడిది!' అంటూ ఎవరూ అవకాశాలు ఇవ్వలేదు. దీంతో రూ.60లక్షలు అప్పు చేసి విజయ్ తండ్రే దర్శకుడిగా ఆయనతో సినిమా తీశారు. అలా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఎన్నో ఆశలతో సినీ రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన విజయ్‌కు తొలి ప్రయత్నంలో నిరాశే ఎదురైంది. తొలి సినిమా 'నాళయ తీర్పు' ఫ్లాప్. రెండు నెలలు కనీసం ఫ్రెండ్స్‌ను కలవడానికి కూడా విజయ్ బయటకు వెళ్లలేదు. చివరకు ఆ స్నేహితులే విజయ్‌కు అండగా నిలబడ్డారు. ఆయనలో ధైర్యం నింపారు.తనను తాను నిరూపించుకోవాలనుకున్న విజయ్.. డ్యాన్స్ పైన కసరత్తు మొదలుపెట్టాడు. కరాటే నేర్చుకున్నాడు. పగలూ, రాత్రీ ఇంకే ధ్యాసా లేకుండా సాధన చేశాడు. ఆ తర్వాత సరికొత్త విజయ్‌గా 'రసిగన్' అనే సినిమా చేశాడు. 1994లో విడుదలైన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఒకప్పుడు విమర్శించినవాళ్లే.. శెభాష్ అంటూ మెచ్చుకున్నారు. 1990 చివర్లో, 2000 ప్రారంభంలో విజయ్ సినీరంగాన్ని శాసించారు. 'ఖుషి', 'గిల్లి' వంటి సినిమాలతో సూపర్ హిట్‌లు అందుకున్నారు. అప్పుడే అందరూ విజయ్‌ను 'ఇళయ దళపతి' అని పిలవడం ప్రారంభించారు. అనతికాలంలోనే ఆ పేరు దళపతిగా మారింది. విజయ్ నటించిన 'అదిరింది', 'సర్కార్', 'విజిల్', 'మాస్టర్' వంటి సినిమాలు ఆయన్ని ప్రేక్షకులకు మరింతగా చేరువ చేశాయి. ప్రేక్షకుల అభిమానం సొంతం చేసుకున్న విజయ్.. వారికి సేవ చేయాలని రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. 2024 ఫిబ్రవరి 2న 'తమిళగ వెట్రి కజగం' స్థాపించారు. ఈ పార్టీ ప్రారంభించాక 'లియో' ఆడియో రిలీజ్‌లో విజయ్ చేసిన వ్యాఖ్యలు ఆయనకు అభిమానులంటే ఎంత ప్రేమో తెలియజేశాయి. 'నాపై ఇంత అభిమానం చూపుతున్న మీకు ఏదైనా తప్పకుండా చేయాలనుంది. చేస్తా. మీ కాలికి చెప్పులా ఉండటానికి కూడా వెనకాడను. ఇప్పుడేం జరిగినా పట్టించుకోకుండా అందరూ ఓపికగా ఉండండి. విజయాన్ని అందుకోవచ్చు' అన్నారు. నాడు చెప్పినట్లు గానే నేడు విజయాన్ని అందుకున్నారు.

## రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

అవసరం అయితే తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామన్నారు. ధాన్యం కొనుగోలు చేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు. ఆ క్రమంలో ఈ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇకపోతే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా గోస పుచ్చుకుంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రైతులకు కేటీఆర్ భరోసా ఇచ్చారు. రైతులకు సమయానికి రైతుబంధు వేసిన చరిత్ర కేసీఆర్‌ది అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కొనకుండా అన్నదాతలను వేధిస్తోందని అన్నారు. ఆంక్షలు లేకుండా పంటలు కొన్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వరి, జొన్నలు, శనగ పంటలకు మద్దతు ధర ఇవ్వడం లేదని తెలిపారు. రైతులకు మద్ద తుగా బీఆర్ఎస్ కదం తొక్కుతుందని పేర్కొన్నారు. రాబోయే వారం రోజుల పాటు కొనుగోలు కేంద్రాలను పరిశీలిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులంతా కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన తెలియజేయాలన్నారు. తహశీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీద్దామని అన్నారు.

## ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు



గట్టి షాకిస్తూ భాజపా దూసుకెళ్లింది. కేరళలో యూడీఎఫ్ కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే 104 చోట్ల ఆధిక్యంలో ఉంది. డీఎంకే 62, అన్నాడీఎంకే 68 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో 293 స్థానాలకు గానూ.. భాజపా దాదాపు 205 చోట్ల ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 85 చోట్ల ముందంజలో కొనసాగుతోంది. కేరళలో 140 స్థానాలుండగా.. యూడీఎఫ్ 100 సీట్లను గెల్చుకుంది.. ఎల్‌డీఎఫ్ 32 స్థానాల్లో, ఎన్డీయే 3చోట్ల గెలుపొందింది. అస్సాంలో 126 స్థానాలుండగా.. భాజపా 100కు పైగా సీట్లతో హ్యాట్రిక విజయాన్ని నమోదు చేసింది. స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కాంగ్రెస్ 26 చోట్ల ముందంజలో ఉంది. పుదుచ్చేరీలో 30 స్థానాలకు గానూ ఎన్నార్ కాంగ్రెస్9 చోట్ల గెలిచి 11 చోట్ల ఆధిక్యంలో ఉంది. కాంగ్రెస్ 2 చోట్ల గెలిచి.. 5 స్థానాల్లో ముందంజలో ఉంది. మొత్తంగా బిజెపి తనకున్న రెండు రాష్ట్రాలకు తోడు బెంగాల్లో పాగా వేసింది. కేరళలో పదేళ్ల తరవాత మళ్లీ కాంగ్రెస్ అధికారం దక్కించుకుంది. తమిళనాట ద్రవిడ పార్టీలకు పరాభవం తప్పలేదు.

## ప్రస్తుత రాజకీయాలపై జనం విసిగిపోయారు

ఇస్తారనే ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారుతుందని, పాత శక్తులకు కాలం చెల్లి కొత్త శక్తులు అధికారంలోకి వస్తాయని ఆమె ధీమాగా ఉన్నారు. మార్పు అనేది సమాజానికి సహజమని, తమిళ ప్రజల చైతన్యం తెలంగాణలో కూడా కనిపిస్తుందని ఆమె విశ్లేషించారు. కవిత మాటలు అధికార పక్షాలకు సవాలు విసిరేలా ఉండటమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఆమె తన పార్టీ పాత్రను ఎంత కీలకంగా భావిస్తున్నారో స్పష్టం చేస్తున్నాయి.తమిళనాడు ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసిన వేళ, తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకు రాలు కవిత చేసిన సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది.

# నెల్లూరు జిల్లాలో మహానాడు

- మహానాడు కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- జిల్లా పర్యటనలో మంత్రి నారాయణ వెల్లడి

**నెల్లూరు,మే4 :** తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది నిర్వహి ంచే మహానాడును ఈ సారి నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తు న్నామని ఏపీ మంత్రి నారాయణ వెల్లడించారు. మహా నాడును అత్యంత ప్రతిష్మాత్మకంగా నిర్వహించబోతున్నామని పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహా నాడును ఇఫ్కోసెజ్‌లో నిర్వహించాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. అక్కడ రెండు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఆ ప్రాం తాన్ని శుభ్రం చేయిస్తున్నామని.. ఈ నెల 6వ తేదీన పను లు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాష్ట్రం, ప్రజల భవిష్య త్తుకు సంబంధించి కీలక నిర్ణయాలను మహానాడులో తీసు కుంటామని.. ప్రజలకు పలు హామీలు ఇస్తామని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది మహానాడుకు రానున్నారని చెప్పుకొచ్చారు. ట్రాఫిక్, ఇతర సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి నారాయణ పేర్కొ న్నారు. ప్రజ లకు ఇచ్చిన హామీలన్నింటినీ కూటమి ప్రభుత్వం నెరవేరు స్తోందని మంత్రి నారాయణ మరోసారి స్పష్టం చేశారు. ఈరోజు(సోమవారం) ఉదయం నెల్లూరు జిల్లాలోని దస్తగిరి నగర్‌లో రూ.1.43 కోట్లతో చేపట్టబోయే సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మా ట్లాడుతూ.. సిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు శరవే గంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంపై గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్లిందని... పరిశ్రమలు వెళ్లిపోయాయని.. రియల్ ఎస్టేట్ పడిపో యిం దని విమర్శించారు. అప్పులు తీరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. సీఎం చంద్రబాబు అనుభవంతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందని తెలి పారు. యువనేత లోకేశ్ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తు న్నారన్నారు. ఈ ఏడాది దేశంలో వచ్చిన పరిశ్రమల్లో 25 శాతం ఏపీకి వచ్చాయని తెలిపారు. పరిశ్రమలు వస్తే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని చెప్పుకొచ్చారు. 'మహానాడు ఎక్కడ పెట్టాలో చెప్పటానికి వైసీపీ నేతలు ఎవరు? మా పార్టీ అధినేత నిర్ణయిస్తారు' అని అన్నారు.



వైసీపీ తీరు మార్చుకోకపోతే ఆ పదకొండు సీట్లు కూడా ఈసారి రావని.. జనం గుండు సున్నా పెడతారంటూ మంత్రి నారాయణ హెచ్చరించారు.

## బెంగాల్ గెలుపుతో విపక్షాల్లో వణుకు



- తెలంగాణలోనూ బిజెపి గెలుపు తథ్యం
- అత్యతంత ప్రతిష్టాత్మకంగా 10న ప్రధాని సభ
- ఎంపి ధర్మపురి అర్వింద్ వెల్లడి

**హనుమకొండ,మే4 :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన ఘన విజయం తర్వాత విపక్షాల్లో వణుకు మొదలైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. హనుమ కొండలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2028 అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్ వస్తున్నారని చెప్పారు. లక్ష మందితో ఈ భారీ సభ అత్యంత ప్రతిష్మాత్మకంగా జరగనుం దన్నారు. తెలంగాణలో కూడా ఎస్ఐఆర్ అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా అరవింద్ మాట్లాడుతూ.. 'వచ్చే రెండు రోజులు కేసీఆర్‌కు టీవీని దూరంగా ఉంచండి, లేదంటే ఆయనకు గుండెపోటు వచ్చే అవకాశం ఉందని ఎద్దేవా చేశారు. కొందరికి పార్టీ లు పెట్టడం, డబ్బులు వసూలు చేయడం బిజినెస్‌గా మారిందని, కేసీఆర్‌తో ఎలాంటి పొత్తులూ ఉం డన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండేళ్లు నాన్చి సీబీ ఐకి అప్పగించారు. సీబీఐ తన పని తాను చేసుకు పోతుంది. తెలంగాణలో ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు వచ్చే పరిస్థితి లేదు. ఇక రాష్ట్రంలో అభివృద్ధి పనుల గురించి ఏం మా ట్లాడతాం. సన్నబియ్యం ఇస్తున్నామని సీఎం రేవంత్ అంటున్నారు.. వాస్తవానికి ఆ బియ్యం ఇస్తుంది నరేంద్ర మోదీనే. కేసీఆర్ పెట్టిన పంగనామాలను రేవంత్ రెడ్డి కంటిన్యూ చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం అన్ని రంగాల్లోనూ విఫలమైందని అన్నారు.

## అకాల వర్షాలతో ప్రభుత్వం అప్రమత్తం

**ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు ఆదేశాలు**
**అధికారులతో మంత్రి ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్,మే4 :** అకాల వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ మేర కు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ధాన్యం కొనుగోళ్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మా ట్లాడుతూ.. 'రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేక రించింది. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధి ంచి రూ.2001.96 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. రానున్న 3 నుంచి 4 రోజుల పాటు అకాల వర్షాలు పడే అవకాశం ఉంది. అధి కారులు అప్రమత్తంగా ఉండాలి. ఈదురుగా లులు, వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నం దున నల్గొండ, నిజామాబాద్ జిల్లాలపై ప్రత్యేక ఫో కస్ పెట్టాలి. వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొను గోలు కేంద్రాల నుంచి వెంటనే మిల్లులకు తరలి ంచేలా చర్యలు తీసుకోవాలి. ప్రతి కొనుగోలు కేం ద్రంలో అవసరమైనన్ని తార్పాలిన్లు (పాలీథిన్ కవ ర్లు) సిద్ధంగా ఉంచాలి. అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేలా అధికారులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి' అని అన్నారు.

## ఆ మూడు రాష్ట్రాలు మార్పు కోరుకున్నాయి

**ఎన్‌డిఏ విజయంపై పవన్ అభినందనలు**

**అమరావతి,మే4 :** తమిళనాడు, కేరళం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ప్రజలు ఈసారి మార్పును బలంగా కోరుకున్నారని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆ మార్పును తమ తీర్పు ద్వారా స్పష్టంగా తెలియజేశారని పేర్కొన్నారు. అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తమ ప్రాభవాన్ని నిలబెట్టుకున్న ఎన్డీఏకు ఈ సందర్భంగా పవన్ శు భాకాంక్షలు తెలిపారు. పశ్చిమ బెంగాల్ ప్రజల నమ్మకాన్ని పొందేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొన్ని సంవత్సరాలుగా కృషి చేశారని, ఇప్పుడు దానికి ఫలితం దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వం లో పశ్చిమ బెంగాల్ ఉంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో సురక్షితంగా ఉంటామన్న విశ్వాసంతోనే ఆ రాష్ట్ర ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని పవన్ అన్నారు. ఈ భారీ విజయానికి భాగస్వాములైన మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, బీజేపీ పశ్చిమ బెంగాల్ నేత సువేందు అధికారికి హృదయ పూర్వక అభినందనలు తెలిపారు. అస్సాం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి మరోమారు విజ యాన్ని సాధించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మకు, పుదుచ్చేరిలో ఎన్డీఏ కూటమికి విజయాన్ని మళ్లీ అందించిన ఎన్.ఆర్.కాంగ్రెస్ నేత, ముఖ్యమంత్రి రంగసామికీ పవన్ అభినందనలు తెలిపారు. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ వైపే ప్రజలు మొగ్గు చూపారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే మంచి విజయాన్ని సాధించిన విజయ్‌ను మనసారా అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే- బీజేపీ కూటమి పోరాటం బలంగా సాగిందని, అదే విధంగా కేరళంలోనూ మెజారిటీ ఓటర్లు మార్పునే కోరుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్ నాయకత్వానికి కూడా డిప్యూటీ సీఎం అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల పోరాటంలో విజయం సాధించిన అందరికీ పవన్ కల్యాణ్ పేరుపేరున శుభాభినందనలు తెలియజేశారు.

## కేరళలో చారిత్రాత్మక విజయం

**విజయంపై విజయ్‌కు రాహుల్ అభినందనలు**

**న్యూఢిల్లీ,మే4 :** కేరళ ఓటర్లు నిర్ణయాత్మక తీర్పు అందించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాం ధీ పేర్కొ న్నారు. తాను ఇంతకుముందు చెప్పిన ట్లుగా.. కేరళలో ప్రతిభ, సామర్థ్యాలు ఉన్నాయని.. ఇప్పుడు, ఆ రెండింటినీ సద్వినియోగం చేసుకునే యూడీఎఫ్ ప్రభుత్వం ఏర్పడనుందని తెలిపారు. త్వరలోనే కేరళకు వెళ్తానని 'ఎక్స్' వేదికగా చెప్పారు. తమిళనాడు ఫలితాల్లో టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించిన నేపథ్యంలో.. విజయ్‌కు రాహుల్ గాం ధీ ఫోన్ చేసి అభినందించారు. 'టీవీకే అద్భుతమైన ఫలితం సాధించింది. పెరుగుతోన్న యువస్వరం ప్రాధాన్యాన్ని ఈ తీర్పు ప్రతిబింబిస్తోంది. ఇక్కడి ప్రజల ప్రయోజనాలు కాపాడే విషయంలో ఎప్పుడూ ముందుంటాం' అని తెలిపారు. కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సత్తా చాటింది. 140 స్థానాలకుగానూ 102 కైవసం చేసుకుంది. దీంతో పదేళ్ల తర్వాత రాష్ట్రంలో మరోసారి అధికారం చేపట్టనుంది. మరోవైపు, తమిళనాడులో మొత్తం 234 స్థానాలు ఉండగా.. టీవీకే ఇప్పటివరకు 100కుపైగా స్థానాల్లో విజయం సాధించింది. పూర్తి ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది.

## సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**కాకినాడ,మే4 :** ప్రజల ఆరోగ్య భద్రత, సంక్షేమమే లక్ష్యంగా ఏపీ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 54 మంది లబ్దిదారులకు రూ.26.41 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. లబ్దిదారుల ఆరోగ్య పరిస్థి తులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 835 మంది లబ్దిదారులకు రూ.5.93 కోట్ల మేర సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు మంత్రి వెల్లడించారు.

## నటులు తలచుకుంటే చరిత్ర సృష్టిస్తారు

**విజయ్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ అభినందనలు**

**అమరావతి,మే4 :** పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి, తమిళనాడు ఎన్నికల ఫలితాలపై హిందూపురం ఎమ్మెల్యే, నంద మూరి బాలకృష్ణ స్పందించారు. పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదు చ్చేరిలో విజయం సాధించిన బీజేపీ, ఎన్డీఏ కూటమి పార్టీలకు బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సారథ్యంలోనే నూతన భారత నిర్మాణం సా ధ్యం అవుతుందని అన్నారు. ఈ ఘన విజయాన్ని సాధించిన ఎన్డీఏ కూటమికి విజయాభినందనలు తెలియజేశారు.మరోవైపు తమిళ నాడు ఎన్నికల ఫలితాలపై బాలయ్య స్పందిస్తూ తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావును స్మరిం చుకున్నారు. నటుడు తలచుకుంటే చరిత్రను తిరగరాయగలడని తమిళనాట ఎంజీఆర్, తెలుగునాట ఎన్టీఆర్ నిరూపించారని గుర్తు చేశారు. మళ్లీ ఆ ప్రభంజనాన్ని స్ఫురణకు తెచ్చిన సోదరుడు విజయ్‌ను అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. తమిళ ప్రజలు తనపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చటమే లక్ష్యంగా ముందుకు సాగాలని బాలకృష్ణ అభిలషించారు.

## మోడీ నాయకత్వంపై అచంచల విశ్వాసం

**ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**విశాఖపట్నం,మే4 :** ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రజల విశ్వాసానికి ఈ ఎన్నికల ఫలితాలే స్పష్టమైన నిదర్శనమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. సోమవారం మీడి యాతో మాట్లాడుతూ.. 'వికసిత్ భారత్' లక్ష్యంతో దేశం ముందుకు సాగాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, నితిన్ నబిన్ నాయకత్వంపై ప్రజలకు గట్టి నమ్మకం ఉందని వెల్లడించారు. బీజేపీ విజయానికి కృషి చేసిన ప్రతీ నాయకుడు, కార్యకర్తకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అస్సాం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి స్పష్టమైన మెజారిటీ లభించిందని.. తమిళనాడులో హంగ్ ప్రభు త్వం ఏర్పడే అవకాశం ఉందని మాధవ్ అన్నారు. తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో కూడా బీజేపీ ఓటు శాతంలో గణనీయమైన పెరుగుదల నమోదు అయ్యిందన్నారు. అభివృద్ధి, జాతీయ భద్రత, పారదర్శక పాలనకు ప్రజలు పూర్తి మద్దతు ఇచ్చారన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, డిజిటల్ పురోగతికి దేశవ్యాప్తంగా ప్రశంసలు వచ్చాయన్నారు. యువత, మహిళలు, రైతులు, మధ్యతరగతి మద్దతే విజయానికి కీలకంగా మారిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషి.. నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామన్నారు. దేశాభివృద్ధి కోసం అందరూ ఏకమై ముందుకు రావాలని మాధవ్ పిలుపునిచ్చారు.

## మధ్యాహ్న భోజనంలో రాగిజావ కొనసాగింపు

**పాఠశాలల్లో మరోమూడేళ్ల కొనసాగేలా ఒప్పందం**
**మంత్రి లోకేశ్ సమక్షంలో విద్యాశాఖ ఒప్పందం**

**అమరావతి,మే4 :** ఏపీ ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కింద రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని మరో మూడేళ్ల పాటు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్‌తో విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. 2026-29 కాలానికి ఈ కార్యక్రమం కొనసాగనుంది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని తరగతుల విద్యార్థులకు సన్నబియ్యంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా కూటమి ప్రభుత్వం అందిస్తోంది. మెనూలో మార్పులు చేసి ఎక్కువ మంది విద్యార్థులకు రుచికరమైన, శుచిగా భోజనం అందించేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక పర్యవేక్షణ వహిస్తున్నారు. శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ సహకారంతో రాగిజావ పంపిణీ కార్యక్రమం మార్చి 2023లో ప్రారంభమైంది. ఈ ఏడాది ఏప్రిల్‌తో కాలపరిమితి ముగిసింది. విద్యార్థులకు అదనపు పోషకాహారం అందించే ఉద్దేశంతో మరో మూడేళ్లు కొనసాగించాలని విద్యాశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది.

# సంపాదకీయం

## బిజెపికి మరింత శక్తి !

బెంగాల్,తమిళనాడు, కేరళం ప్రజలు మార్పు కోరుకున్నారు. ఈ మార్పు ఎక్కువగా బిజెపికే లాభించింది. ముఖ్యంగా బెంగాల్, తమిళనాట పాలకుల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. కేవలం కుటుంబ పాలనతో ప్రజలను విస్మరించిన మమత, స్టాలిన్‌లకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారు. బిజెపికి కొత్త శక్తిని ఇచ్చారు. దేశమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూసినా..అందరి దృష్టి కేవలం బెంగాల్‌పైనే ఉంది. బెంగాల్లో మమతా బెనర్జీని బిజెపి మట్టికరిపిస్తుందా లేదా అని ఎదురు చూశారు. అనుకున్నట్లుగానే, మోడీ, అమిత్ షా ద్వయం బెంగాల్లో కూడా పాగా వేశారు. అస్సాంలో పట్టు నిల్పుకున్నారు. కలకత్తా కాళీ కరుణించింది. బిజెపికి పగ్గాలు అప్పగించిది. ఇక డబుల్ ఇంజిన్ సర్కార్ అక్కడా మార్పు కోసం యత్నించ నుంది. దేశంలో నాలుగు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతానికి జరిగిన ఎన్నికల ఫలితాలు మార్పును సూచించాయి. ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు వచ్చాయి. బిజెపి, కాంగ్రెస్ ఖాతాలో మరో రాష్ట్రం పడగా, తమిళనాడులో టివికె పార్టీ తొలి ప్రయత్నంలోనే అధికారం దక్కించుకో బోతోంది. ఇక్కడ డిఎంకె మళ్లీ విజయం సాధిస్తుందన్న అంచనాలు తలకిందులయ్యాయి. కేరళంలో దశాబ్దం తరవాత కాంగ్రెస్ కూటమి అధికారం లోకి రాబోతోంది. ఇక అసోం, పాండిచ్చేరిలో బిజెపి అధికారం నిలుపుకుంది. మొత్తంగా బెంగాల్లో మమత, తమిళనాట స్టాలిన్‌ల అహంకారంపై ప్రజలు అంకుశం దింపారు. ఇది వారి స్వయంకృత ఓటమిగానే చూడాలి. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళం విజయం ఆ పార్టీకి ఊరటనిచ్చే అంశం. తమిళనాట పార్టీ పెట్టిన రెండేళ్లలోనే అధికారం చేపట్టబోతున్న విజయ్ ఓ రకంగా చరిత్ర సృష్టించారనే చెప్పాలి. నిరంకుశంగా పాలించడంతో పాటు కేవలం దక్షిణాది, హిందీ వ్యతిరకత ప్రదర్శించిన డిఎంకెకు ప్రజలు గుపాఠం చెప్పారు. బెంగాల్లో మమతా బెనర్జీ ఏకపక్ష రాక్షస పాలనకు ప్రజలు చరమగీతం పాడారు. బంగ్లాదేశ్‌కు సరిహద్దు రాష్ట్రంగా ఉన్న బెంగాల్లో అవినీతి, అధికార దురహంకారం పెచ్చుమీరాయి. 15 ఏళ్లపాటు రాజ్యమేలిన బెంగాల్లో మమతా బెనర్జీ రాష్ట్రాన్ని మాఫియా కోటగా తయారు చేసుకున్నారు. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. ఓట్ల కోసం అక్ర చొరబాటుదారులను చేరదీశారు. వారికి ఆధార్ కార్డులు, ఓటరు కార్డులు మంజూరయ్యాయి. బంగ్లా వసలదారుల పెత్తనంలో సొంత రాష్ట్రం ప్రజలు నలిగి పోయారు. పరాయి ప్రజలుగా మారారు. అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు నిత్యకృత్యం అయ్యాయి. ఇవన్నీ ఎదరించిన వారిని మట్టు పెట్టారు. దాడులు, విధ్వంస రచన సాగింది. అందుకే వీటిలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. వరుసగా నాలుగోసారి మమతా బెనర్జీ అధికారాన్ని అందుకుంటారా? లేకుంటే మమత పాలనకు బీజేపీ చరమ గీతం పాడనుందా? అంటూ ఈ రాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దాదాపు 50 ఏళ్ల పాటు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రాన్ని రెండు పార్టీలే పాలించాయి. 34 సంవత్సరాలు జ్యోతిబసు నేతృత్వంలోని లెఫ్ట్ ఫ్రంట్, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని ఏలాయి. కానీ ఈ సారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ పాగా వేయడంతో అక్కడ కొత్త చరిత్ర లిఖితం కాబోతోంది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోరు నడించింది. ఆ సమయంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దాదాపుగా ఐదేళ్లుగా అక్కడ బిజెపి వివిధ సమస్యలపై పోరాడుతూ వచ్చింది. అందుకు ఫలితం దక్కింది. బెంగాల్లో బిజెపి కాషాయ జెండా ఎగరేయడం ఓ చరిత్రగా చూడాలి. ఇకపోతే ఈ విజయం ఓ రకంగా మోడీ, అమిత్ షాల పట్టుదల, వ్యూహాత్మక రాజకీయాలకు నిదర్శనంగా చూడాలి. రాష్ట్రంలో గత మూడు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన టీఎంసీ నాలుగోసారి విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ ప్రజలు ఛీకొట్టారు. మరోవైపు బెంగాల్‌లో పాగా వేయాలని శక్తియుక్తులన్నీ ధారపోసిన బీజేపీ కూడా తనదే విజయం అనిచాటుకుంది. ప్రధాని మోడీ, అమిత్ షాలు ఇక విజయోత్సవాల్లో పాల్గొనడానికి వస్తామని చెప్పారు. ఎగ్జిట్‌పోల్స్‌లో ఎక్కువశాతం మాత్రం బీజేపీకే అనుకూలంగా వచ్చాయి. అయితే, తాము 200 పైచిలుకు స్థానాల్లో గెలవబోతున్నామని సీఎం మమత ప్రకటించారు. కానీ ఓటర్లు బిజెపికే పట్టం కట్టారు. ఇక కేరళ విషయానికి వస్తే ఎన్నికల అయిపోగానే ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ తన పేరు వెనుక సీఎం అనే పదాన్ని తొలగించు కున్నారు.. వృద్ధాప్యంతో పాటు పలు అవినీతి, కుంభకోణాల కారణంగా అనేక విమర్శలు ఎదుర్కొన్నారు. కేరళలో ఎల్‌డిఎఫ్ లేదా యూడిఎఫ్ అధికారం చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత పదేళ్లుగా సినరయ్ విజయ్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ప్రజలు మార్పు కోరుకోవడంతో యూడిఎఫ్‌కు మళ్లీ అధికారం దక్కడం ఖాయమయ్యింది. ఇక తమిళనాడు లో ఓట్ల లెక్కింపునకు ఒకరోజు ముందే రిసార్టు రాజకీయాలు మొదలయ్యాయి. ఈసారి రాష్ట్రంలో హంగ్ వస్తుందని.. తానే కింగ్ మేకర్ అవుతానన్న ధీమాతో ఉన్న టీవీకే అధ్యక్షుడు దళపతి విజయ్, తన ఎమ్మెల్యేలందరిని రిసార్టుకు తరలించే ఏర్పాట్లు చేసుకున్నారు. అనూహ్యంగా ఆయనే కింగ్ అయ్యారు. అయితే పూర్తి మెజార్టీకి దూరంలో ఉన్నారు. దీంతో ఇతర పార్టీలతో జట్టుకట్టక తప్పనిపరిస్థితి ఏర్పడింది. ఈక్రమంలో అన్న డిఎంకె కూడా రెండోస్థానంతో సత్తా చాటింది. ఎప్పుడూ ద్విముఖ పోరు జరిగే తమిళనాడులో ఈసారి త్రిముఖ పోరు సాగింది. దశాబ్దాలుగా రాష్ట్ర రాజకీయాలను డీఎంకే లేదా అన్నాడీఎంకే పార్టీలే శాసిస్తుండగా.. వీటి మధ్యలోకి ఈసారి'తమిళ వెత్రి కళగం' (టీవీకే) పార్టీతో సినీనటుడు విజయ్ ప్రవేశించారు. సీఎం స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకేదే ఈసారి కూడా అధికారమని మె జారిటీ ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. 'యాక్సిస్ మై ఇండియా' మాత్రం విజయ్ పార్టీ ఏకంగా 120 వరకు సీట్లు గెలుస్తుందని అంచనా వేసింది. విజయ్ పార్టీ గెలవడంతో ఇప్పుడు తమిళనాడు లో సరికొత్త రాజకీయ శకం మొదలైనట్లే. మొత్తంగా ఫలితాలు బిజెపిలో ఆశావహ దృక్పథాన్ని నిలిపాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా కొంత తోడ్పడిందనే చెప్పాలి.

## పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

### భారీగా బందోబస్తు ఏర్పాటు

### బెంగాల్ కౌంటింగ్‌పై ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ,మే4 : దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం పకడ్బందీగా చేపట్టారు. భారీ బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు సాగింది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా భద్రత ఏర్పాటు చేశారు. బెంగాల్లో మరిన్ని బలగాలను మొహరించారు. టీఎంసీ, బీజేపీ మధ్య నువ్వా -నేనా అన్నట్లుగా పోటీ ఉన్న బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు వేళ..ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సీఎం మమతాబెనర్జీ సిద్ధమయ్యారు. ఆదివారమే తన పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు ఆ మేరకు దిశా నిర్దేశంచేశారు. బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీలకు గత నెలలో జరిగిన ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడ్డాయి. ఆయా రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కోసం కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బాలెట్లతో ఓట్ల లెక్కింపు ప్రారంభమయ్యింది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు భిన్న ఫలితాలను అంచనా వేయటంతో పోటీచేసిన రాజకీయ పార్టీల్లో ఫలితాలపై నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఈసీ చర్యలు తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా అడ్డుకోవడానికి తొలిసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టింది. తాజా ఎన్నికల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్‌పైనే నిలిచింది. ఇక్కడ 294 అసెంబ్లీ స్థానాలుండగా, నేడు 293 స్థానాల ఫలితాలను ప్రకటించను న్నారు. ఫాల్టా నియోజకవర్గంలో పోలింగ్‌ను ఈసీ రద్దుచేసింది. ఇక్కడ ఈ నెల 21న పోలింగ్ జరగనుంది. ఆమె పోటీ చేసిన భవానీపూర్ నియోజకవర్గం ఫలితంపైఇప్పుడు అందరి దృష్టి ఉంది. ఇక్కడ ఆమెకు ప్రత్యర్థిగా బీజేపీ సీనియర్ నేత సువేందు అధికారి నిలబడ్డారు. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో ఆయన మమతను ఓడించారు. బెంగాల్‌లో గత నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. దేశ చరిత్రలోనే అత్యధికంగా 92.47శాతం ఓటింగ్ నమోదైంది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుం డటంతో ఓట్ల లెక్కింపు కోసం దాదాపు 2.5 లక్షల మంది కేంద్ర బలగాలను నియమించారు. కేరళలో పోలింగ్‌కు ముందే కీలక పరిణామం చోటుచేసుకుంది. వామపక్ష కూటమి ఎల్డీఎఫ్‌ను వరుసగా రెండుసార్లు గెలిపించి చరిత్ర సృష్టించినసీఎం పినరయ్ విజయన్.. తనకు తానుగా సీఎం పేరును వదిలేసుకొని సంచలనం సృష్టించారు. తన సోషల్‌మీడియా ఖాతాలో ఆదివారం ఆయన కేరళ ముఖ్యమంత్రి అనే పదాన్ని తొలగించి సీపీఐఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అనే పదాలను చేర్చారు. 140 అసెంబ్లీ స్థానాలున్న కేరళలో ఏప్రిల్ 9న ఒకే విడతలో పోలింగ్ జరిగింది. ఈసారి ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి గెలుపు ఖాయమని ఎక్కువ శాతం ఎగ్జిట్‌పోల్ సర్వేలు ప్రకటించాయి. అస్సాంలో అధికారాన్ని నిలబెట్టుకోవటంపై బీజేపీ ధీమాగా ఉంది. ఎగ్జిట్‌పోల్ సర్వేలు కూడా మళ్లీ బీజేపీదే అధికారమని ప్రకటించాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తోంది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరిగింది. 2.50 కోట్ల ఓటర్లున్న ఇక్కడ.. 85.96 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు కోసం 40 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 722 మంది అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుంది. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో మొత్తం 30 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు కూడా ఉదయమే ప్రారంభం అయ్యింది. ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి నేతృత్వంలోని 'ఏఐఎన్ఆర్‌సీ - బీజేపీ' కూటమిదే మళ్లీ అధికారమని సర్వేలు తెలిపాయి.

# తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతం

- ద్రవిడ పార్టీల పాలనకు చరమగీతం
- అనూహ్యంగా దూసుకు వచ్చిన విజయ్ పార్టీ
- మ్యాజిక్ ఫిగర్‌కు చేరువగా టివికె
- ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందు చేసిన ఫలితాలు
- తమిళనాడు సిఎం స్టాలిన్ ఘోర పరాజయం
- ఆయన బాటలోనే అత్యధిక మంత్రులు ఓటమి
- పెద్దగా ప్రభావం చూపని బిజెపి నేతలు



చెన్నై,మే4 : తమిళనాట కొత్త చరిత్ర ఆవిష్కృతమయ్యింది. అనూహ్యంగా దూసుకు వచ్చిన నటుడు విజయ్ పార్టీ తమిళనాట జెండా పాతింది. ఎగ్జిట్ పోల్ అంచనాలను తలకిందులు చేస్తూ ద్రవిడ పార్టీలను మట్టి కరిపించింది. అధికార డిఎంకెను ఓ కుమ్ము కుమ్మింది. తమిళనాట హిందీ వ్యతిరేకత, దక్షిణాదికి అన్యాయం అంటూ హుంకరించిన సిఎం స్టాలిన్ పార్టీ ఓడడమే గాకుండా స్వయంగా ఆయన కూడా ఓడిపోయారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళసై సైతం వరుసగా రెండోసారి ఓటమిదిశలో ఉన్నారు. ఒకప్పటి తన అనుచరుడు, డిఎంకె పార్టీ నేత చేతిలో దారుణంగా ఓటమి చెందారు. ఆయన కుమారుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం విజయం దిశగా ఉన్నారు. మంత్రులు చాలామంది ఇంటి ముఖం పట్టారు. ఇక టీవీకే చీఫ్ విజయ్.. పెరంబూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తాజా సమాచారం ప్రకారం టివికె 108 స్థానాల్లో, 59 స్థానాల్లో డిఎంకె, 44 స్థానాల్లో అన్నాడీఎంకే అభ్యర్థులు లీడింగ్‌లో ఉన్నారు. చెన్నై, చంగల్‌పట్టు, కంచీపురం, తిరువల్లూరులో టివికె విజయ కేతనం ఎగురవేసింది.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో ద్రావిడ్ పార్టీల ఆధిపత్యం ఉండేది. సెంట్రల్ తమిళనాడులోనూ టీవీకే మంచి పోటీ ఇచ్చింది. తిరుచిరాపల్లి, తాంజావురు, కరూర్, పెరంబలూరు, అరియాలూరు, నాగపట్టణం, తిరువరూరు, పుడుకొట్టై, మలదుతరై జిల్లాలో టివికె గట్టి పోటీనిచ్చింది. దీంతో దళపతి ఇక కొత్త సిఎంగా కావడం అనివార్యం అయ్యింది. చిన్నా చితక పార్టీలు లేదా అన్నడిఎంకెతో పొత్తు కుదిరితే సరిపోతుంది. మొత్తంగా తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో దళపతి విజయ్ సరికొత్త చరిత్ర సృష్టించారు. తన రాజకీయ పార్టీ తమిళగ వెత్రి కళగం ద్వారా ఎన్నికల బరిలోకి దిగిన ఆయన, దశాబ్దాలుగా రాష్ట్రాన్ని ఏలుతున్న ద్రావిడ పార్టీలను విస్మయానికి గురిచేశారు. తాజా ట్రెండ్స్ ప్రకారం, విజయ్ నేతృత్వంలోని టీవీకే ఏకంగా 109 స్థానాల్లో ముందంజలో ఉండి, రాష్ట్రంలో అతిపెద్ద పార్టీగా అవతరించే దిశగా దూసుకుపోతోంది. సినిమా స్టార్‌లు రాజకీయాల్లో రాణించలేరన్న అపవాదును చెరిపివేస్తూ, విజయ్ తన సినీ పాపులారిటీని ఓట్లుగా మార్చుకోవడంలో సఫలమయ్యారు. తద్వారా దివంగత నేతలు ఎన్టీ రామారావు, ఎంజీ రామచంద్రన్, జయలలిత వంటి దిగ్గజాల సరసన ఆయన నిలిచారు. 1977 తర్వాత తమిళనాడులో డీఎంకే, ఏఐఏడీఎంకే కాకుండా మరో పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేయడం ఇదే తొలిసారి.పార్టీ అధికార ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ.. 'ఇది కుటుంబ రాజకీయాలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు. ఎవరి మద్దతు లేకుండానే మేము సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం' అని ధీమా వ్యక్తం చేశారు. విజయ్ నివాసం వద్ద ఆయన కుటుంబ సభ్యులు పార్టీ గుర్తు అయిన 'విజిల్' సాంగ్‌తో సంబరాలు చేసుకున్నారు. మెజారిటీ మార్కు 118కి టీవీకే చేరువలో ఉంది. చిన్న పార్టీల మద్దతుతో లేదా స్వతంత్రంగా విజయ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీంతో చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయం వద్ద కార్యకర్తలు మిఠాయిలు పంచుకుంటూ, జెండాలు ఊపుతూ పం దుగ చేసుకున్నారు. ఇకపోతే ఎన్నికల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఓడిపోయారు. కొళత్తూర్ నియోజక వర్గం నుంచి పోటీ చేసిన ఆయన..టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో 9వేల ఓట్ల తేడాతో పరాజయం పాల య్యారు. కొళత్తూరు నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన సీఎం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేక పోయారు. 1996 తర్వాత స్టాలిన్ ఓడిపోవడం ఇదే తొలిసారి. ఎన్నికల ఫలితాల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ టీవీకే గెలుపు దిశగా దూసుకుపోతోంది. స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ మాత్రం ఆధిక్యంలో కొనసాగుతున్నారు. వీఎస్ బాబుకు 82 వేల పైచిలుకు ఓట్లు రాగా, స్టాలిన్‌కు దాదాపు 73 వేల ఓట్లు పోలయ్యాయి. అన్నాడీఎమ్‌కేకు చెందిన సంతానకృష్ణన్ దాదాపు 14 వేల ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. 1996 తరువాత డీఎమ్‌కే అధినేతకు ఓటమి ఎదురు కావడం ఇదే తొలిసారి. వీఎస్ బాబు గతంలో డీఎమ్‌కే, ఏఐఏడీఎమ్‌కే పార్టీల్లో సేవలందించారు. 2006-11 మధ్య పురసవల్కం ఎమ్మెల్యేగా పనిచేశారు. 2011 వరకూ డీఎమ్‌కే ఉత్తర చెన్నై డిస్ట్రిక్ట్ సెక్రటరీగా కూడా ఉన్నారు. 2011 నాటి ఎన్నికల్లో కొళత్తూర్ నియోజకవర్గం ఇన్‌ఛార్జ్‌గా కూడా ఉన్నారు. ఆ ఎన్నికల్లో సీఎం స్టాలిన్‌కు మెజారిటీ తగ్గడంతో విమర్శల పాలయ్యారు. అనంతరం అన్నాడీఎమ్‌కేలో చేరారు. ఈ ఏడాది నటుడు విజయ్ సారథ్యంలోని టీవీకే పార్టీలో చేరారు. తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టిన విజయ్ సారథ్యంలోని టీవీకే విజయపథంలోకి దూసుకెళ్తోంది. అయితే మెజారిటీకి 118 సీట్లు అవసరమవుతాయి. మెజారిటీ తగ్గిన పక్షంలో ప్రభుత్వం ఏర్పాటుకు ఏయే పార్టీలతో సంప్రదింపులు జరిపే అవకాశం ఉందనే దానిపై తాజాగా సోషల్ మీడియాలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకునేది లేదని టీవీకే ఇంతకుముందే ప్రకటించింది. అయితే టీవీకే మెజారిటీకి అతి దగ్గరలో ఆగిపోయిన పక్షంలో ఆ పార్టీ మద్దతు తీసుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. కాగా, సెక్యులర్ ప్రొగ్రసివ్ అలెయెన్స్‌లో భాగంగా డీఎంకేతో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. ట్రెండ్స్ ప్రకారం కాంగ్రెస్ 5 స్థానాల్లో, సీపీఐ రెండు స్థానాల్లో, సీపీఎం ఒక స్థానంలో గెలుపునకు చేరువలో ఉన్నాయి. డీఎంకేతో కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్నప్పటికీ ఆ పార్టీలోని కొందరు టీవీకే పట్ల సానుకూలంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో టీవీకేతో పొత్తు పెట్టుకోవాలని కాంగ్రెస్‌లోని ఒక వర్గం మొదట్నించీ పట్టుపడు తోంది. అయితే చివరి నిమిషంలో డీఎంకేతోనే కలిసి పోటీ చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు కాంగ్రెస్ మద్దతు తీసుకునే అవకాశాలు బలంగా ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా ప్రభుత్వం ఏర్పాటులో భాగంగా టీవీకే ఇటు కాంగ్రెస్‌తో పాటు ఐయూఎంఎల్, డీఎండీకే, లెఫ్ట్ పార్టీల సాయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. డాక్టర్ అన్బుమణి రామదాస్ సారథ్యంలోని పీఎంకే మద్దతును కూడా టీవీకే కూడగట్టవచ్చని చెబుతున్నారు. ఏదిఏమైనా పూర్తి ఫలితాలు వెలువడిన తర్వాతే టీఎంకే వ్యూహరచన ఉంటుందని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

# అవినీతిని ప్రశ్నించినందుకే క్రిశాంక్ అరెస్ట్

- జైలులో బిఆర్ఎస్ నేతకు పరామర్శ
- ఫోన్లు ట్యాప్ అవుతున్నాయని కేటీఆర్ ఆరోపణలు





సంగారెడ్డి,మే4 : కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే మన్నే క్రిశాంక్‌ని అన్యాయంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని ధ్వజమెత్తారు. ఆయనపై 35 కేసులు పెట్టి సీఎం రేవంత్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతు న్నారని ఆగ్రహించారు. బీఆర్ఎస్, సోషల్ మీడియాపై పెట్టిన శ్రద్ధలో ఒక్క పైసా అయిన.. సీఎం శాంతిభద్రతలపై దృష్టి పెడితే బాగుంటుందని హితవు పలికారు. సోమవారం కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలుకు కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేరుకున్నారు. జైల్లో ఉన్న మన్నే క్రిశాంక్‌తో వారు ములాఖత్ అయ్యారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కేపీ వివేకానంద్, పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. మన్నె క్రిషాంక్ ఓ ఉన్నత విద్యావంతుడు, న్యాయవాది, పీహెచ్‌డీ పట్టా పొందిన వ్యక్తి. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమంలో ముందుండి పోరాడిన ఆయన, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత టీఎస్ ఎండీసీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారని తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వ అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తూ ప్రజల ముందుకు తీసుకువస్తున్నందుకే క్రిషాంక్‌పై వరుసగా కేసులు నమోదు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. నాలుగేళ్ల కంటే తక్కువ శిక్ష ఉన్న కేసుల్లో స్టేషన్ బెయిల్ ఇవ్వాల్సిన పరిస్థితిలో 12 రోజులుగా జైలులో పెట్టి 'హ్యాబిచు వల్ అఫెండర్'గా చూపించడం దుర్మార్గమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయాలను ప్రశ్నించినందుకే కేసులు పెట్టారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న నేరాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకుండా సోషల్ మీడియా పోస్టులపై కేసులు పెట్టడంలోనే బిజీగా ఉందని కేటీఆర్ విమర్శించారు. కరీంనగర్‌లో పగటిపూట కాల్పులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించలేదు. కానీ, ఎవరు ట్వీట్ చేశారు అన్నదానిపై మాత్రం అప్రమత్తంగా ఉందని ఎద్దేవా చేశారు. పోలీసు వ్యవస్థను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని ఆరోపిస్తూ పోలీసులు ముఖ్యమంత్రి ప్రైవేట్ ఆర్మీలా పనిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్, హ్యాకింగ్, జర్నలిస్టులపై వేధింపులు వంటి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. హైకోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా క్రిషాంక్‌ను అరెస్ట్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ విషయంపై కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ వేస్తామని తెలిపారు.మా నాయకులను వేధించినా మేము వెనక్కి తగ్గం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలకు ఎవరూ భయపడవద్దు. పార్టీ లీగల్ సెల్ మీకు అండగా ఉంటుంది. న్యాయం, ధర్మం మన వైపు ఉన్నాయి అని తెలిపారు. చివరగా ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను బయటపెడుతున్న మీడియాకు కృతజ్ఞతలు తెలుపారు. కరీంనగర్‌లో పట్టపగలు జ్యువెలరీ షాపులో దాడి జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్‌కు పరువు, సిగ్గు అనేవి లేవని విమర్శించారు. తమ నేతలపై పోలీసులు ఓవర్ యాక్షన్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రైవేటు ఆర్మీలా పని చేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ నేతలు, జర్నలిస్టుల ఫోన్లను పోలీసులు హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. తాము ఎవరెవరితో మాట్లాడుతున్నారో తెలుసుకుంటున్నారన్నారు. సీఎం రేవం త్‌రెడ్డి ఇప్పటికైనా పాలనపై దృష్టి పెట్టాలని కేటీఆర్ కోరారు.

# బెంగాల్లో బిజెపి స్పష్టమైన ఆధిక్యం

### సర్ ప్రక్రియతో ఓట్లను దొంగిలించిన బిజెపి

### సిఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు



కోల్‌కతా,మే4: పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో భాజపా 190 స్థానాల్లో ముందంజలో ఉండడంతో అక్కడ బిజెఇప ప్రభుత్వ ఏర్పాటు దాదాపుగా ఖాయమయ్యింది. ఈ క్రమంలో సీఎం మమతా బెనర్జీ కీలక ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో భాజపా ఓట్లను దొంగిలించిందని ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. 'ఏజెంట్లు, అభ్యర్థులు ఎవరూ కౌంటింగ్ కేంద్రాలను విడిచి వెళ్లొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఇది భాజపా పథకం. మొదటి రెండు, మూడు రౌండ్లలో వారే ఆధిక్యంలో ఉన్నట్లుగా చూపిస్తారని నేను ముందు నుంచి చెబుతూనే ఉన్నాను. కొన్నిచోట్ల రెండు, మూడు రౌండ్ల తర్వాత కౌంటింగ్ ఆపేశారు. టీఎంసీని అణచివేసేందుకు కేంద్ర బలగాలను బలవంతంగా ఉపయోగిస్తున్నారు. సీట్ల ఆధిక్యంపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సంఘం కేంద్ర బలగాలతో కలిసి ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. రాష్ట్ర పోలీసులు కూడా కేంద్ర బలగాలకు పూర్తిగా లొంగిపోయారు' అని మమత ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఏజెంట్లు, కార్యకర్తలు ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని కోరారు. ఇంకా చాలా రౌండ్లు ఉన్నాయని.. తుది ఫలితాల్లో తమదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. కాగా.. 293 సీట్లకు ఓట్ల లెక్కింపు జరుగుతుండగా.. 190 స్థానాల్లో భాజపా ఆధిక్యంలో ఉంది. టీఎంసీ 97 స్థానాల్లో, కాంగ్రెస్ 1 చోట ఆధిక్యంలో ఉన్నాయి.ఈ క్రమంలో ఎన్నికల కౌంటింగ్‌కు ముందు బీజేపీపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్ కోతలు చోటు చేసుకున్నాయన్నారు. సీసీ టీవీలు కూడా ఆఫ్ అయ్యాయని పేర్కొన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు ఉంచిన ప్రదేశాలకు వాహనాల రాకపోకలు కొనసాగిస్తున్నాయని చెప్పారు. ఇవన్నీ బీజేపీ అదేశాల మేరకే జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఈ పరిస్థితులు నెలకున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ పార్టీ కార్యకర్తలకు సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పదంగా అనిపిస్తే.. వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని వారికి సీఎం మమతా బెనర్జీ స్పష్టం చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్ కోసం అధికారులను డిమాండ్ చేయాలని కేడర్‌ను పశ్చిమ బెంగాల్ సీఎం కోరారు. మరోవైపు కోల్‌కతాలోని ఖుదీరామ్ అనుశిలిని స్టేడియంలో కెమెరా ఆఫ్ చేసి ఉన్న కంప్యూటర్ స్క్రీన్ వీడియోను మమత కేబినెట్‌లోని మంత్రి శశి పంజా తన ఎక్స్ ఖాతా ద్వారా పంచుకున్నారు. వీడియో ఆఫ్ చేసిన ఫుటేజ్ తమకు చూపించాలని అధికారులను తాము డిమాండ్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. తమ పోరాటం కొనసాగుతుందని వివరించారు. శ్యామ్‌పుకూర్ అసెంబ్లీ స్థానం నుంచి టీఎంసీ అభ్యర్థిగా శశి పంజా బరిలో నిలిచారు.

# తెలంగాణలోనూ ఇక బిజెపి ఖాయం



- ఇండియా కూటమికి ఈ ఫలితాలు చెంపపెట్టి
- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావు

**బలగం టీవి, హైదరాబాద్**

తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ప్రజలు ఇండియా కూటమికి బుద్ధి చెప్పారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఈ ఫలితాలను చూస్తే తెలంగాణలోనూ భాజపా అధికారంలోకి వస్తుందనేది స్పష్టమవుతోందని వ్యాఖ్యానించారు. గత 33 ఏళ్ల కమ్యూనిస్టులు, 15 ఏళ్ల తృణమూల్ పాలించిన బెంగాల్ కోటలో భాజపా విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

అస్సాంలో మూడోసారి భాజపా కూటమి అధికారంలోకి వస్తోందన్నారు. కుటుంబ రహిత, అవినీతి రహిత పాలన అందించాం కాబట్టే.. అస్సాంలో మళ్లీ తమ పార్టీ విజయం సాధించిందని తెలిపారు. ఉత్తరాది, దక్షిణాది వైషమ్యాలు సృష్టించిన ఇండియా కూటమికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ తుడిచి పెట్టుకుపోతుందన్నారు. కూకట్‌పల్లి నుంచి మైనార్టీలు భాజపాలో చేరారని.. ముస్లిం మహిళలు మోదీని పెద్దన్నగా భావిస్తున్నారన్నారు. మే 10న పరేడ్ మైదానంలో జరిగే బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని పిలుపునిచ్చారు.

దేశవ్యాప్తంగా సాగుతున్న బీజేపీ జైత్రయాత్ర తెలంగాణలోనూ పునరావృతమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ఇక్కడ కాషాయ జెండా ఎగరడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన అఖండ విజయంపై అక్కడి ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

"ఎక్కడైతే బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయో, అక్కడ ప్రజలు మళ్లీ మాకే అధికారాన్ని కట్టబెడుతున్నారు. బీజేపీ అనేది ఒక కుటుంబ పార్టీ కాదు.. ఇది ప్రజాస్వామ్య విలువలు, అవినీతి రహిత పాలనను అందించే పార్టీ" అని రాంచందర్ రావు పేర్కొన్నారు. మరోవైపు ఇండీ కూటమిని ప్రజలు తిరస్కరించారని, తమిళనాడులో డీఎంకే మూడో స్థానానికి పడిపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు. ఉత్తర-దక్షిణ విభజన రాజకీయాలు చేసే వారికి ఓటర్లు సరైన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు.

**మే 10న మోదీ భారీ బహిరంగ సభ:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 10న హైదరాబాద్ పర్యటనకు రానున్నట్లు రాంచందర్ రావు ప్రకటించారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ఈ భారీ బహిరంగ సభకు 'జనగ్రాహ సభ'గా నామకరణం చేశామని, ఇప్పటికే భూమి పూజ కూడా పూర్తయిందని తెలిపారు. ఈ సభకు సుమారు 2 లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు.

మోదీ పర్యటన నేపథ్యంలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించి ఏర్పాట్లను సమీక్షించారు. "ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేత మోదీ గారికి చారిత్రాత్మక స్వాగతం పలికేందుకు తెలంగాణ సిద్ధంగా ఉంది. మే 10న సాయంత్రం 4 గంటలకు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ఈ సభకు ప్రజలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు.



# తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం


- ఆగివున్న లారీని ఢీకొన్న అంబులెన్స్
- రోగి సహా నలుగురు దుర్మరణం

**బలగం టీవి, శ్రీకాళహస్తి**

తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఊరందూరు హైవేపై ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలు కాగా.. వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కోల్‌కతా నుంచి ఓ రోగిని చికిత్స నిమిత్తం బెంగళూరు అంబులెన్స్‌లో తరలిస్తుండగా.. ఓరందూరు వద్ద హైవే పక్కన నిలిపి ఉన్న లారీని వెనకనుంచి ఢీ కొట్టింది. అంబులెన్స్‌లో డ్రైవర్‌తో సహా ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాయుడుపేట – రేణిగుంట జాతీయ రహదారిపై శ్రీకాళహస్తి మండలం ఊరందూరు వద్ద ఆగి ఉన్న లారీని అంబులెన్స్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సమాచారం అందగానే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ఒక రోగిని మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరులోని ఓ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై అప్పటికే నిలిపి ఉంచిన లారీని అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి అంబులెన్స్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న రోగితో పాటు ఆయనకు సహాయకులుగా ఉన్న మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారని ప్రాథమిక సమాచారం. వీరి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న శ్రీకాళహస్తి పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు.

# పేదవాడి కలల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం..

**- కేకే మహేందర్ రెడ్డి**



**బలగం టీవీ, గంభీరావుపేట :**

పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసే సత్తా కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు . సోమవారం లింగన్నపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల కార్యక్రమానికి కేకే మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న దుష్ట, అహంకార, అవినీతి పరిపాలనకు చరమగీతం పాడుతూ తెలంగాణ ప్రజలు ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు . తెలంగాణ రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన ఘనత కేసీఆర్ కే దక్కుతుందని అన్నారు.

?ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. దేశ చరిత్రలో బ్యాంకుల జాతీయకరణ నుంచి నేటి ఉపాధి హామీ పథకం వరకు అన్నీ కాంగ్రెస్ పార్టీ చలవేనని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు . రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ స్కిల్ యూనివర్సిటీలు, రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ వంటి వినూత్న పథకాలను తీసుకువచ్చిందని, పేద ధనిక తేడా లేకుండా సన్న బియ్యం అందిస్తున్న ఘనత కూడా ఈ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

?ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయలక్ష్మి తిరుపతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పర్శ హన్మాండ్లు, స్థానిక సర్పంచ్ ఎల్లయ్య, ఉపసర్పంచ్ నరసింహులు, మాజీ జెడ్పిటిసి మల్లుగారి నర్సాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంగి స్వామి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గుర్రం రాజు గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ మరియు నాయకులు తాజ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం

**చెట్టు కూలి ఇద్దరు మృతి.. వారపు సంతలో కలకలం**

**బలగం టీవి, అమరావతి**



అల్లూరి జిల్లాలో సోమవారం కురిసిన వడగండ్ల వాన తీవ్ర బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. వర్షానికి ముందు వాతావరణంలో అకస్మాత్తుగా మార్పులు చోటుచేసుకుని చల్లబడగా, అనంతరం కారుమబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఒక్కసారిగా కురిసిన ఈ వానతో వారపు సంతలో ఉన్న వ్యాపారులు, కొనుగోలుదారులు తలదాచుకోవడానికి అష్టకష్టాలు పడ్డారు. సంత ప్రాంగణం బురదమయంగా మారి చిరు వ్యాపారులు తీవ్ర నష్టపోయారు. కూరగాయలు విక్రయానికి తెచ్చిన వ్యాపారులు వాటిని అక్కడికక్కడే వదిలేసి పరుగులు తీశారు.

ఇదే సమయంలో పాత ఎంపీడీఓ క్వార్టర్స్, ఎంపీపీ నివాస సమీపంలో భారీ చెట్టు కూలిపోయింది. ఆ చెట్టు కింద వ్యాపారం చేస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మెరుపులు, ఉరుముల శబ్దంతో సంతకు వచ్చిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై అధికారులు సమాచారం అందుకుని ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# మోడీ నాయకత్వానికి ప్రజల మద్దతు

**ఎన్నికల ఫలతాలపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు**

**బలగం టీవి, హైదరాబాద్**



ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరిలో ఎన్డీఏ అభ్యర్థులు ముందంజలో కొనసాగుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వానికి మద్దతు తెలుపుతున్నారని సీఎం పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ట్రెండ్‌ను పరిశీలిస్తే ఎన్డీఏ అభ్యర్థుల ప్రదర్శన స్పష్టంగా కనిపిస్తోందని చెప్పుకొచ్చారు. ప్రజల్లో మోదీపై విశ్వాసం తగ్గలేదని, మరింతగా పెరిగిందని అభిప్రాయపడ్డారు. దేశ అభివృద్ధి దిశగా కేంద్రప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల కు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం పోస్టు పెట్టారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే 'వికసిత భారత్' లక్ష్యానికి ప్రజలు మద్దతు తెలుపుతున్నారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ దిశగా కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని తెలిపారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే నినాదం కేవలం మాటలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే విధంగా అమలవుతోందని సీఎం కొనియాడారు. అభివృద్ధి ఫలాలు ప్రతివర్గానికి అందేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఎన్డీఏ కూటమిని మరింత ఐక్యంగా, బలంగా మారుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ అభివృద్ధి కోసం కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుత ఫలితాలు మోదీ నాయకత్వంపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని, 'వికసిత భారత్' దార్శనికతకు ఇది బలమైన మద్దతని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. 'సబ్ కా సాథ్' స్ఫూర్తితో దూసుకెళ్తున్న ఎన్డీఏ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ మరింత బలోపేతం అవుతుందని ఉద్ఘాటించారు.

# కెన్యాను వణికిస్తున్న వరదలు.. పది మంది మృతి

**బలగం టీవి,న్యూఢిల్లీ**

ఆఫ్రికా దేశమైన కెన్యాలో ప్రకృతి ప్రకోపం బీభత్సం సృష్టిస్తోంది. గత శుక్రవారం నుంచి కురుస్తున్న భారీ వర్షాలు, తదనంతర వరదల కారణంగా పది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్తు వల్ల దేశంలోని మౌలిక సదుపాయాలు ధ్వంసం కావడమే కాకుండా, జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.

ప్రస్తుత వర్షాలకు కెన్యా తూర్పు ప్రాంతం అత్యంత దారుణంగా దెబ్బతిన్నట్లు జాతీయ పోలీస్ సర్వీస్ వెల్లడించింది. మొత్తం పది మంది మృతులలో ఏడుగురు ఈ ప్రాంతానికి చెందిన వారేనని అధికారులు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ధృవీకరించారు.

పశ్చిమ ప్రాంతంలోని టాంబచ్‌లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో స్థానికుల నివాసాలు, ఇతర మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి.ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కెన్యా పోలీసులు కోరారు. వరద నీరు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాలకు, బలహీనంగా ఉన్న వంతెనలకు దూరంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బాధితులకు సాయం చేసేందుకు మరియు చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది.

# విజయ్‌కు హరీష్‌రావు అభినందనలు

**బలగం టీవి, హైదరాబాద్**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (ఎఖ) పార్టీ సాధించిన అద్భుత ప్రదర్శనపై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్‌రావు స్పందించారు. రాజకీయ అరంగేట్రం చేసిన తొలి ఎన్నికల్లోనే విజయ్ సంచలన విజయం దిశగా దూసుకెళ్లడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ట్విట్టర్ (ఎక్స్) వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

"తమిళనాడు రాజకీయాల్లో అద్భుతమైన అరంగేట్రం చేసిన నటుడు విజయ్‌కు హృదయపూర్వక అభినందనలు. ఈ ప్రజా తీర్పు ప్రజల ఆశలను, మార్పు పట్ల వారికున్న ఆకాంక్షలను స్పష్టంగా ప్రతిబింబిస్తోంది" అని హరీష్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రాజకీయాల్లోకి కొత్త రక్తం రావడం, ప్రజా పక్షాన నిలబడటం ఆహ్వానించదగ్గ పరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజా జీవితంలో విజయ్ తన ప్రస్థానాన్ని మరింత విజయవంతంగా కొనసాగించాలని హరీష్‌రావు ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో టీవీకే పార్టీ క్రియాశీలక పాత్ర పోషించాలని కోరుతూ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో సంప్రదాయ రాజకీయ పార్టీలను కాదని, విజయ్ నేతృత్వంలోని సరికొత్త పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టడంపై దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ నేత హరీష్‌రావు స్పందించడం విశేషం.

# విజయ్‌తో చేతులు కలపండి..

**కాంగ్రెస్‌కు విజయ్ తండ్రి ఎస్‌ఏ చంద్రశేఖర్ పిలుపు**

**బలగం టీవి, హైదరాబాద్**

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కజగం' (ఎఖ) సంచలన విజయాల దిశగా దూసుకెళ్తున్న తరుణంలో, ఆయన తండ్రి, ప్రముఖ దర్శకుడు ఎస్‌ఏ చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ కావడమే కాకుండా పొత్తుల సమీకరణాలపై చర్చను రేకెత్తించాయి. తమ పార్టీతో చేతులు కలపాలని ఆయన కాంగ్రెస్ పార్టీకి బహిరంగంగా విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ పార్టీకి ఘనమైన చరిత్ర, సంప్రదాయం ఉన్నాయని, అయితే అధికారం లేకపోవడం వల్లే ఆ పార్టీ ప్రస్తుతం క్షీణిస్తోందని చంద్రశేఖర్ విశ్లేషించారు. "ఇతర పార్టీలకు మద్దతు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ తన సొంత అస్తిత్వాన్ని కోల్పోతోంది. టీవీకేతో చేతులు కలిపితే ఆ కోల్పోయిన అధికారాన్ని తిరిగి పొందే అవకాశం ఉంటుంది. ఆ అధికారాన్ని ఇవ్వడానికి విజయ్ సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్ తన చరిత్రను నిలబెట్టుకోవాలంటే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన సూచించారు.విజయ్ రాజకీయ రంగ ప్రవేశం ఆకస్మికంగా జరిగింది కాదని, సమాజం కోసం, తమిళ ప్రజల కోసం ఏదో ఒకటి చేయాలనే ఆలోచన ఆయనలో గత 30 ఏళ్లుగా ఉందని చంద్రశేఖర్ వెల్లడించారు. "ప్రజల కోసం పని చేయాలనే తపనతోనే విజయ్ తన ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఈ రోజు ఆ కల నిజమవుతోంది. తమిళనాడు తదుపరి ముఖ్యమంత్రి విజయ్ కాబోతున్నారని నేను పూర్తి విశ్వాసంతో చెబుతున్నాను" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




# నర్సంపేట గడ్డపై 'అసెంబ్లీ టైగర్' ఓంకార్ శతజయంతి ముగింపు సభ

**మే 12న భారీ బహిరంగ సభ.. పోస్టర్ ఆవిష్కరించిన ఎంసీపీఐ(యు) నేతలు**

**కమ్యూనిస్టు, సామాజిక శక్తుల ఐక్యతే ఏకైక మార్గం: రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐ(యు) వ్యవస్థాపక నేత, మాజీ శాసనసభ్యులు అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ గారి శతజయంతి వార్షికోత్సవాల ముగింపు సభను చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని 'ఓంకార్ భవన్'లో మే 12న నర్సంపేటలో జరగనున్న బహిరంగ సభకు సంబంధించిన గోడ పత్రికలను (పోస్టర్లను) పార్టీ ముఖ్య నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ.. నాటి సాయుధ పోరాటం నుంచి పీడిత ప్రజల గొంతుకగా ఓంకార్ గారు ఎగిసిపడ్డారని కొనియాడారు. "నర్సంపేట ప్రజలు ఆయనను ఐదుసార్లు శాసనసభకు పంపారు. అసెంబ్లీలో అవినీతి, అక్రమాలపై ఆయన గర్జించిన తీరును చూసి ప్రజలే ఆయనను 'అసెంబ్లీ టైగర్ ఓంకార్' అని పిలుచుకున్నారు. కమ్యూనిస్టులు మరియు సామాజిక శక్తులు ఐక్యమైతేనే రాజ్యాధికారం సాధ్యమని ఆయన ఆకాంక్షించారు" అని పేర్కొన్నారు.

వరంగల్ జిల్లా నర్సంపేటలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో మే 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఈ భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

ప్రధాన వక్తలు: ఎంసీపీఐ(యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, మాజీ జాతీయ కార్యదర్శి కుల్దీప్ సింగ్, ఢిల్లీ రైతాంగ పోరాట నాయకుడు కిరణ్ జిత్ సింగ్ శేఖాన్.

పాల్గొనే ప్రముఖులు: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి. శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నేత పోటు రంగారావు, సీపీఎం నేత జి. నాగయ్య, అరుణోదయ విమలక్క, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత ఆవునూరి మధు, ప్రసాదన్న (సీపీఐ ఎంఎల్), మురారి (ఎస్‌యూసీఐ సి) తదితరులు హాజరుకానున్నారు.

ఈ ముగింపు సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థి, యువజన, మహిళా, కార్మిక, కర్షక సంఘాలు మరియు మేధావులు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ కోరారు. సభలో భాగంగా భారీ ఎత్తున ప్రజల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, వి. తుకారాం నాయక్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. రమేష్, నిజామాబాద్ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె మురళి, ఏపీఎంఎస్ కోశాధికారి తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

# చెపాక్‌లో ఉదయనిధి విజయం..

**మైలాపూర్‌లో తమిళిసై ఓటమి**

**బలగం టీవి, హైదరాబాద్**



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. చెపాక్–-తిరువెళ్లికేని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి డీఎంకే యువనాయకుడు, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ విజయం సాధించారు. సమీప తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అభ్యర్థి సెల్వంపై 7,140 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని వీడి టీవీకేలో చేరిన సెల్వం గట్టి పోటీ ఇచ్చినప్పటికీ చివరికి ఓటమి చెందారు. అన్నాడీఎంకే అభ్యర్థికి 16 వేల పైచిలుకు ఓట్లు మాత్రమే లభించాయి.

మరోవైపు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ఓటమి పాలవగా, ఆయన తనయుడు ఉదయనిధి విజయం సాధించడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో డీఎంకే శాసనసభా పక్ష నేతగా ఉదయనిధి వ్యవహరించే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

ఇక మైలాపూర్ నియోజకవర్గంలో బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు, మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఓటమి పాలయ్యారు. ఈ స్థానంలో టీవీకే అభ్యర్థి వెంకటరామనన్ సమీప డీఎంకే అభ్యర్థిపై 28 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందారు. తమిళిసై మూడో స్థానానికి పరిమితమవగా, ఆమెకు 32,328 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ ఫలితాలతో తమిళనాడు రాజకీయాల్లో కొత్త మార్పులకు నాంది పలికినట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రధాని మోదీ విజన్‌పై ప్రజలకు అచంచల విశ్వాసం: నారా లోకేశ

**బలగం టీవి, హైదరాబాద్**



నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ చారిత్రాత్మక విజయపథంలో దూసుకెళ్లడం, అసోంలో అధికారాన్ని నిలబెట్టుకోవడాన్ని ఆయన స్వాగతించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా ఎన్డీయే కూటమికి, ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలియజేశారు.

"అసోం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీయే సాధించిన విజయానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. అభివృద్ధి, స్థిరత్వం, నిర్ణయాత్మక నాయకత్వంపై ప్రజలకు ఉన్న బలమైన విశ్వాసానికి ఈ ప్రజా తీర్పు అద్దం పడుతోంది" అని లోకేశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోదీ దార్శనికత వల్లే దేశం పురోగమిస్తోందని ఆయన కొనియాడారు.

**మోదీ నాయకత్వానికి బలమైన ఆమోదం:**

మోదీ పాలనపై దేశ ప్రజల్లో నమ్మకం మరింత బలపడిందని లోకేశ్ విశ్లేషించారు. "వేగంగా, పారదర్శకంగా, సమగ్రంగా అందే పాలనపై దేశ ప్రజల నమ్మకాన్ని ఈ తీర్పు పునరుద్ఘాటించింది. వృద్ధి, అవకాశాలు, సమ్మిళిత ప్రగతిని ఆకాంక్షించే భవిష్యత్ భారత్‌కు ఇది బలమైన ఆమోదం" అని ప్రశంసించారు.



## కామారెడ్డి -- సిరిసిల్ల రహదారిపై రైతుల భారీ ధర్నా
### నిలిచిపోయిన వాహనాల రాకపోకలు..

- **తూకంలో మోసాలు, లారీల కొరతపై ఆగ్రహం..**

**బలగం టీవీ, గంభీరావుపేట**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ దమ్మన్నపేట, నాగంపేట గ్రామాలకు చెందిన రైతులు గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి వద్ద కామారెడ్డి -- సిరిసిల్ల ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ నిరసనతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలు భారీగా నిలిచిపోయాయి.

ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా బస్తాకు ఉండాల్సిన దానికంటే అధిక తూకం, వేస్తున్నారని ఆరోపించారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకుందామంటే, తూకం పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారని,దీనికి తోడు, ధాన్యం బస్తాలు నింపినప్పటికీ సకాలంలో లారీలు రాకపోవడంతో కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయని, వర్షాలు వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రైతుల ఆందోళన సమాచారం అందుకున్న తహసిల్దార్ మారుతి రెడ్డి మరియు పోలీసులు తక్షణమే అక్కడికి చేరుకున్నారు. లారీల కొరతను వెంటనే తీరుస్తామని, తూకంలో ఎలాంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ మారుతి రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు.



## కన్నీటి పయనం: తోపుడు బండిపై కొడుకు శవం

**అంబులెన్స్ రాక.. ఆర్థిక స్థోమత లేక.. కరీంనగర్ జిల్లాలో హృదయవిదారక ఘటన**

**బలగం టీవీ, కరీంనగర్**

పేదరికం ఆ తల్లిదండ్రులకు పుట్టెడు దుఃఖాన్ని మిగిల్చింది. కన్న కొడుకు కళ్ల ముందే ప్రాణాలు విడిచినా, కడసారి చూపు కోసం ఇంటికి తీసుకెళ్లడానికి కనీసం వాహనం దొరకని దుస్థితి నెలకొంది. చివరకు తాము జీవనోపాధి పొందే తోపుడు బండినే ఆ దంపతులు పాడెగా మార్చుకున్నారు. ఈ హృదయవిదారక ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో చోటుచేసుకుంది.

గ్రామస్తుల కథనం ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి చెందిన ఎల్కపెల్లి వీరయ్య, రుక్కమ్మ దంపతులు రోడ్డు పక్కన తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి కుమారుడు యాకూబ్(38) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం యాకూబ్ ఆరోగ్యం క్షీణించడంతో, తల్లిదండ్రులు అతడిని మెయిన్ రోడ్డుపై ఉన్న తమ రేకుల షెడ్డు వద్దకు తీసుకువచ్చారు. వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా, అప్పటికే యాకూబ్ మృతి చెందినట్లు నిర్ధారించారు. నిబంధనల ప్రకారం మృతదేహాలను తరలించలేమని చెప్పి అంబులెన్స్ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రైవేట్ వాహనాన్ని మాట్లాడుకుందామంటే చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి. అటు కన్న కొడుకు మరణం.. ఇటు మృతదేహాన్ని తరలించే మార్గం లేక ఆ వృద్ధ దంపతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు.

చివరకు వేరే దారి లేక, తాము పండ్లు అమ్ముకునే తోపుడు బండిపైనే కుమారుడి మృతదేహాన్ని ఉంచి, కన్నీరుమున్నీరవుతూ గ్రామంలోని తమ ఇంటికి తరలించారు. ప్రధాన రహదారిపై సాగిన ఈ కన్నీటి పయనాన్ని చూసిన స్థానికులు, ప్రయాణికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. "చనిపోయిన వ్యక్తికి గౌరవంగా అంతిమ సంస్కారం నిర్వహించేందుకు కూడా పేదరికం అడ్డుపడటం అత్యంత బాధాకరం" అని చూపర్ల కళ్లు చెమ్మగిల్లాయి.

## బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు ఇటీవల హైదరాబాద్ ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. అనంతరం వారి కుటుంబ సభ్యులు బొల్లి రాజు, బొల్లి రామ్మోహన్ లను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు.. వారి మృతి చాలా బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని విప్ ప్రార్థించారు..

## ప్రముఖ రచయిత పెద్దింటి అశోక్ కుమార్‌కు 'ఎస్‌జీ ఫౌండేషన్' కథా పురస్కారం...



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సాహిత్య రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న ప్రముఖ సినీ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ను ప్రతిష్టాత్మక ఎస్‌జీ ఫౌండేషన్ కథా పురస్కారం వరించింది. భీముని మల్లారెడ్డిపేటకు చెందిన ఆయన, గత దశాబ్దాలుగా కథా సాహిత్యంలో చేస్తున్న కృషిని గుర్తిస్తూ ఫౌండేషన్ ఈ అవార్డును ప్రకటించింది.

అశోక్ కుమార్ కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, తెలుగు సాహిత్య లోకంలో తన కలంతో బలమైన సంతకం చేశారు. ఆయన సృజించిన రచనల వివరాలు, సుమారు 300కు పైగా కథలు. 7 నవలలు (వీటిలో 'జిగ్రి' వంటి నవలలు బహుళ ప్రజాదరణ పొందాయి). 5 నాటికలు. 12 కథా సంకల్నాలు ప్రచురితం.

ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్ పి. శ్రీనివాస్ గౌడ్ వివరాలను వెల్లడించారు. మే (2026) చివరి వారంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో పెద్దింటికి నగదు బహుమతితో పాటు ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు.




## ఎండ దెబ్బకు రిక్రియేషన్ క్లబ్ 'చల్లని' ఆసరా

**గోదావరిఖని చౌరస్తాలో ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం**

**నెల రోజుల పాటు కొనసాగనున్న సేవా కార్యక్రమం**

**బలగం టీవీ, రామగుండం**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భానుడు భగభగలాడుతున్నాడు. 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతుండగా, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు రామగుండం రిక్రియేషన్ క్లబ్ ముందుకొచ్చింది. సామాజిక సేవా దృక్పథంతో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రజలకు ఎంతో ఊరటనిస్తోంది.

వివిధ అవసరాల నిమిత్తం గోదావరిఖనికి వచ్చే చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎండ వేడికి గురికాకుండా ఉండేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం రిక్రియేషన్ క్లబ్ సభ్యులు కె.శరత్ బాబు సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ కజంపురం జయప్రద-రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కేవలం ఒక్కరోజుతో ముగించకుండా, ఎండ తీవ్రత దృష్ట్యా ఈ పంపిణీ కేంద్రాన్ని నెల రోజుల పాటు నిరంతరాయంగా కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ వందలాది మంది బాటసారులు, వాహనదారులు ఇక్కడ మజ్జిగ తాగి సేదతీరుతున్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం రిక్రియేషన్ క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రముఖ పాత్రికేయులు నిట్టూరి జీవన్ బాబు, కార్యవర్గ సభ్యులు బంక రామస్వామి, మారుపాక రాజేంద్ర కుమార్, కొల్లూరి శ్రీనివాస్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో రిక్రియేషన్ క్లబ్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమంపై స్థానికులు మరియు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నేలల సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం..

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

సాగులో నేలల సంరక్షణ, ఎరువుల సరైన వినియోగంపై రైతులు ప్రత్యేక అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ, ఉద్యానవన, సహకార శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు వారోత్సవాల' అవగాహన సదస్సుకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నేల స్వభావాన్ని బట్టి పోషకాల లభ్యత మారుతూ ఉంటుందని, అందుకే ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని కోరారు. శాస్త్రవేత్తల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలని, విచక్షణారహితంగా రసాయనాలు ఉపయోగిస్తే నేల నిస్సారమవ్వడమే కాకుండా పండించిన ఉత్పత్తుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జూన్ 12 వరకు జిల్లాలో వివిధ సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే పారిశుధ్య పనులు, వైద్య పరీక్షలు, 'అరైవ్.. అలైవ్' ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన వంటి పనులు పూర్తి చేశామని అన్నారు. చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరేళ్లలోపు పిల్లలందరూ అంగన్‌వాడీల్లో నమోదు కావాలని పిలుపునిచ్చారు. లోప పోషణ ఉన్న పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక పోషకాహారం మరియు వైద్య సేవలు అందిస్తుందని అన్నారు.



రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సన్న వడ్లు మరియు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు సాగు చేసే రైతులకు ప్రత్యేక బోనస్ అందిస్తోందని, ఇందుకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. అలాగే అధిక దిగుబడినిచ్చే ఆయిల్ పామ్ సాగు కోసం ప్రభుత్వం మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ వంటి వాటిపై సబ్సిడీలు కల్పిస్తోందని, సిద్దిపేట జిల్లా నర్మెట్టలో ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రైతులకు మరింత తోడ్పాటును ఇస్తుందని అన్నారు.

ఈ సందర్భంగా పలువురు ఆదర్శ రైతులను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగం, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన అధికారి శరత్, డీపీఓ షర్ఫుద్దీన్ మరియు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన. షెడ్యూల్ ఖరారు...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మరియు మంత్రుల బృందం విస్తృతంగా పర్యటించనుంది. ఈ బృందంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో పాటు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా బయో గ్యాస్ ప్లాంట్ భూమిపూజ, సబ్‌స్టేషన్ల శంకుస్థాపన మరియు అభివృద్ధి పనులపై కీలక సమీక్షలు నిర్వహించనున్నారు.

ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుండి హెలికాప్టర్ ద్వారా మంత్రుల బృందం బయలుదేరుతుంది.

మధ్యాహ్నం 12:15 గంటలకు గంభీరావుపేట గ్రామానికి చేరుకుని, అక్కడ అధికారులు మరియు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.

మధ్యాహ్నం 12:20 నుండి 1:30 గంటల మధ్య పంతుల తోట వద్ద 'బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్' ఆధ్వర్యంలో నిర్మించనున్న కంప్రెసెడ్ బయో గ్యాస్ ప్లాంట్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి చర్చించనున్నారు.

మధ్యాహ్నం 2:00 గంటలకు సిరిసిల్ల మరియు వేములవాడ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 33/11 ఖు సబ్‌స్టేషన్లకు మంత్రులు శంకుస్థాపన చేస్తారు.

మధ్యాహ్నం 2:30 నుండి 4:00 గంటల వరకు పీజీ సెంటర్‌లో జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి పనులపై మంత్రులు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

పర్యటన ముగిసిన అనంతరం సాయంత్రం 4:15 గంటలకు గంభీరావుపేట నుండి తిరిగి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరుతారు. డిప్యూటీ సీఎం మరియు ముగ్గురు కీలక మంత్రులు ఒకేసారి జిల్లాకు వస్తుండటంతో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

## కంటైనర్ ఢీకొని బీహార్ కూలీ మృతి

- **స్వగ్రామానికి వెళ్తుండగా వెంటాడిన మృత్యువు.. ఆటోను ఢీకొట్టి ఆగని కంటైనర్**
- **మరో ఐదుగురికి గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం**

**బలగం టీవీ, హుజూరాబాద్**

అతివేగం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకోగా, మరికొందరిని ఆసుపత్రి పాలే చేసింది. ఉపాధి కోసం సుదూర ప్రాంతం నుంచి వచ్చిన కూలీలు, పని ముగించుకుని తమ సొంతూరికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. హుజూరాబాద్ మండలం మందాడిపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో బీహార్‌కు చెందిన హమాలీ కార్మికుడు మృతి చెందాడు.

**వరంగల్ వెళ్తుండగా విషాదం:**

పోలీసుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో హమాలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పని ముగించుకుని తమ స్వగ్రామానికి వెళ్లేందుకు వరంగల్ రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. సిరిసిల్ల నుంచి కరీంనగర్ వరకు బస్సులో చేరుకున్న వీరు, అక్కడి నుంచి వరంగల్ వెళ్లేందుకు ఒక ఆటోను అద్దెకు మాట్లాడుకున్నారు. ఆటో మందాడిపల్లి గ్రామ శివారులోకి చేరుకోగానే, వరంగల్ వైపు నుంచి కరీంనగర్ వెళ్తున్న కంటైనర్ అతివేగంతో ఆటోను బలంగా ఢీకొట్టింది.

ఈ ప్రమాద ధాటికి ఆటో పూర్తిగా ధ్వంసమైంది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజు మంజిత్ (18) అనే యువకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. రంజిత్ అనే మరో యువకుడికి తీవ్ర గాయాలవ్వగా, అతని పరిస్థితి విషమంగా ఉంది. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే కంటైనర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు.

స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి పంపారు. ఇంటికి వెళ్తున్న తరుణంలో ఈ ప్రమాదం జరగడంతో తోటి కార్మికులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, పరారీలో ఉన్న కంటైనర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# డిప్యూటీ సీఎం,మంత్రుల పర్యటనకు పటిష్ట భద్రత..



**ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, గంభీరావుపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లాలోని గంభీరావుపేట మండలంలో మంగళవారం ఉపముఖ్యమంత్రి మరియు మంత్రుల బృందం పర్యటించనున్న నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ పర్యటనను పురస్కరించుకుని గంభీరావుపేట మండలంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను మరియు ఇతర ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ మంత్రుల పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పటిష్ట బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సిఐ వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ సిఐ రవి, ఆర్‌ఐలు మధుకర్, రమేష్, ఎస్‌ఐ అనిల్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెళ్లి పీటలు ఎక్కాల్సిన వారు.. కాటికి చేరారు

- **నిశ్చితార్థం తర్వాత విషాదం**
- **గల్ఫ్‌లో ప్రియుడు, గ్రామంలో ప్రియురాలు ఆత్మహత్య**

**బలగం టీవీ, మల్లాపూర్**

వారిద్దరూ ఒకరినొకరు ప్రాణంగా ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నిశ్చితార్థం జరుపుకుని, కొత్త జీవితంపై వేల ఆశలతో ఎదురుచూశారు. కానీ విధి ఆ ప్రేమ జంటపై పగబట్టింది. ఆర్థిక ఇబ్బందుల సెగ ఒకరిని బలితీసుకోగా.. ఆ వియోగం భరించలేక మరొకరు అనంతలోకాలకు వెళ్లారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలో జరిగిన ఈ విషాద ఘటన రెండు గ్రామాలను కన్నీరుమున్నీరు చేసింది.

**ఇల్లు కట్టుకుందామని వెళ్తే.. ఇహలోకాన్ని విడిచాడు**

పాతదాంరాజుపల్లికి చెందిన మక్కల సాయికుమార్ (22), సిరిపూర్ గ్రామానికి చెందిన ఒల్లె శ్రుతి (20) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమకు పెద్దలు అంగీకరించి, ఏడు నెలల క్రితమే ఘనంగా నిశ్చితార్థం నిర్వహించారు. ప్రస్తుతం తమకున్న రేకుల షెడ్డు స్థానంలో మంచి ఇల్లు కట్టుకున్నాకే పెళ్లి చేసుకుంటానని సాయికుమార్ నిశ్చయించుకున్నాడు. కుటుంబ ఆర్థిక స్థితిని మార్చేందుకు గల్ఫ్ దేశమైన బహ్రెయిన్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని ఆదుకుంటున్నాడు.

అయితే, బహ్రెయిన్‌లో ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి కారణంగా మనస్తాపం చెందిన సాయికుమార్.. ఈ నెల 1న అక్కడే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం రాత్రి ఈ సమాచారం శ్రుతికి తెలియడంతో ఆమె ప్రపంచం ఒక్కసారిగా కూలిపోయింది. నిశ్చితార్థం నాటి మధుర స్మృతులు



తలచుకుంటూ, ప్రియుడు లేని లోకంలో ఉండలేక ఆ యువతి అదే రోజు రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

త్వరలోనే మూడు ముళ్ల బంధంతో ఒక్కటి కావాల్సిన జంట.. ఇలా విగతజీవులుగా మారడంతో మల్లాపూర్ మండలంలో విషాదం అలుముకుంది. సాయికుమార్ మృతదేహం ఇంకా స్వదేశానికి రాకముందే, ఇక్కడ శ్రుతి కూడా ప్రాణాలు విడవటం అందరినీ కలిచివేసింది. ఒకేసారి రెండు కుటుంబాల్లో చీకటి నిండటంతో స్థానికులు కంటతడి పెడుతున్నారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# స్వర్ణకారుల దుకాణాల బంద్.. భారీ ర్యాలీ



**జ్యువెలరీ షాపుల యజమానుల తీరుపై నిరసన**

**బలగం టీవీ, వేములవాడ**

పెద్ద జ్యువెలరీ దుకాణాల నిర్వాకంతో తాము ఉపాధి కోల్పోతున్నామంటూ వేములవాడ పట్టణ స్వర్ణకారులు సోమవారం నిరసన గళం విప్పారు. పట్టణంలోని స్వర్ణకార దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేసిన కార్మికులు, తమ పొట్ట కొడుతున్న జ్యువెలరీ యజమానుల తీరును నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

అనంతరం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు గిన్నెల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెద్ద జ్యువెలరీ దుకాణాల తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బంగారం విక్రయించే యజమానులు, వినియోగదారులకు తామే ఆభరణాలు తక్కువ ధరకు తయారు చేసి ఇస్తామంటూ ప్రలోభపెడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల తరతరాలుగా ఆభరణాల తయారీనే నమ్ముకుని బతుకుతున్న స్వర్ణకారుల ఉపాధి దెబ్బతింటోందని వాపోయారు. బంగారం విక్రయించే వరకు పరిమితం కాకుండా, స్వర్ణకారులు చేసే తయారీ పనిని కూడా వారే గుంజుకోవడం ధర్మం కాదని ఆయన మండిపడ్డారు. జ్యువెలరీ యజమానులు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి కత్రోజు వెంకటేష్‌తో పాటు రాము, ప్రసాద్, శంకరయ్య, కట్ట రమేష్, రాజేష్, అరుణ్, సాయి మరియు అధిక సంఖ్యలో స్వర్ణకారులు పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# నైజీరియాలో అమానుషం



- 'రేప్ ఫెస్టివల్' పేరుతో మహిళలపై మృగాళ్ల పర్వం!
- పండుగ వేళ రోడ్లపైనే విద్యార్థినులు, మహిళలపై సామూహిక అఘాయిత్యాలు
- వైరల్‌గా మారిన భయానక దృశ్యాలు
- అంతర్జాతీయంగా వెల్లువెత్తుతున్న నిరసనలు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

నాగరిక సమాజం తలదించుకునేలా ఆఫ్రికా దేశమైన నైజీరియాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. సాంప్రదాయ పండుగ పేరుతో కొందరు మృగాళ్లు వీర విహారం చేశారు. మహిళలు, యువతులు అని చూడకుండా వీధుల్లోనే వారిపై లైంగిక దాడులకు పాల్పడ్డారు. డెల్టా స్టేట్‌లో గత మార్చిలో జరిగిన ఈ ఉదంతానికి సంబంధించిన దృశ్యాలు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పండుగ మాటున పైశాచికం**

డెల్టా స్టేట్‌లోని ఒరాముడు కమ్యూనిటీ సంతానం కోసం 'అల్యూ డు' అనే ఫెస్టివల్‌ను నిర్వహిస్తుంది. అయితే, ఈ పండుగను కొందరు దుండగులు 'రేప్ ఫెస్టివల్'గా మార్చేశారు. వీధుల్లో వెళ్తున్న మహిళలను, స్థానిక విశ్వవిద్యాలయ విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగారు. గుంపులు గుంపులుగా మహిళలను చుట్టుముట్టి, వారి దుస్తులు చింపివేసి, బహిరంగ ప్రదేశాల్లోనే లైంగికంగా వేధించారు. వయసుతో సంబంధం లేకుండా బాలురు, వృద్ధులు సైతం ఈ దారుణాల్లో పాల్గొనడం అక్కడి అరాచక పరిస్థితికి అద్దం పడుతోంది.

ఈ దాడుల నుంచి తృటిలో తప్పించుకున్న ఒక బాధితురాలు సోషల్ మీడియా వేదికగా తన భయానక అనుభవాన్ని పంచుకుంది. "వందలాది మంది మృగాళ్ల మధ్య చిక్కుకున్నాను. వారు నన్ను దారుణంగా హింసించారు. ఇప్పటికీ ఆ గాయాల నుంచి, మానసిక వేదన నుంచి కోలుకోలేకపోతున్నాను" అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ దాడుల్లో తీవ్రంగా గాయపడిన మరికొంతమంది మహిళలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.


ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవ్వడంతో డెల్టా స్టేట్ పోలీసులు స్పందించారు. ఇప్పటికే ఈ దారుణానికి పాల్పడిన కొంతమంది నిందితులను అరెస్టు చేశామని, వీడియోల ఆధారంగా మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని నైజీరియా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఇలాంటి అనాగరిక పద్ధతులపై మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

# హార్మ్యూజ్‌లో హైటెన్షన్

**రంగంలోకి అమెరికా.. 'ప్రాజెక్టు ఫ్రీడమ్' ప్రకటన**

**నౌకల రక్షణ కోసం ట్రంప్ సంచలన నిర్ణయం..**

**సీజ్‌ఫైర్ ఉల్లంఘనేనని ఇరాన్ హెచ్చరిక**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో చిక్కుకుపోయిన వాణిజ్య నౌకలను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లిలి'ప్రాజెక్టు ఫ్రీడమ్' (ౄతీశీయవష్ ఖీతీవవసశీఎ)లిలి పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రకటించారు. అయితే, అమెరికా జోక్యం చేసుకుంటే అది యుద్ధ విరమణ ఒప్పంద ఉల్లంఘనే అవుతుందని ఇరాన్ తీవ్రస్థాయిలో హెచ్చరించడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి.

ప్రపంచ దేశాల అభ్యర్థన మేరకు మానవతా దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. "హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న నౌకల్లో ఆహారం, అత్యవసర వస్తువుల కొరత ఉంది. ఇది సిబ్బంది ఆరోగ్యానికి ప్రమాదకరం. అందుకే సోమవారం ఉదయం నుంచే అమెరికా బలగాలు ఆ నౌకలకు రక్షణ కల్పిస్తూ సురక్షిత ప్రాంతాలకు చేర్చుతాయి" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఎవరు జోక్యం చేసుకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరాన్ ప్రతినిధులతో చర్చలు సానుకూలంగానే సాగుతున్నాయని చెబుతూనే, ఇరాన్ చేసిన తాజా ప్రతిపాదనలను (ఆంక్షల ఎత్తివేత, దళాల ఉపసంహరణ) ట్రంప్ తిరస్కరించడం గమనార్హం.

అమెరికా ప్రకటనపై ఇరాన్ నిప్పులు చెరిగింది. హర్మూజ్ జలసంధి తమ సార్వభౌమాధికారంలో ఉందని, అమెరికా జోక్యం చేసుకుంటే సహించబోమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రత కమిటీ అధిపతి ఇబ్రహీం అజీజీ స్పష్టం చేశారు. "ట్రంప్ భ్రమాత్మక పోస్టులతో పర్షియన్ గల్ఫ్ నిర్వహణ జరగదు. అమెరికా చర్యలు సీజ్‌ఫైర్ ఒప్పందాన్ని తుంగలో తొక్కడమే" అని ఆయన మండిపడ్డారు.

మరోవైపు, హర్మూజ్ జలసంధిలో అరాచక పరిస్థితులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్ సరిహద్దు సమీపంలో ఒక కార్గో షిప్‌పై చిన్నపాటి పడవలతో దాడి జరిగినట్లు బ్రిటన్ సైనిక విభాగం ధ్రువీకరించింది. అయితే అది తనిఖీల్లో భాగమేనని ఇరాన్ సమర్థించుకుంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఈ ప్రాంతంలో సుమారు రెండు డజన్ల నౌకలపై దాడులు జరగడం అంతర్జాతీయ వాణిజ్యాన్ని ఆందోళనలో పడేసింది.

# దేశమంతా బీజేపీ వైపు.. బెంగాల్‌లో అరాచకాలకు చెక్

**కాంగ్రెస్‌కు రాహుల్ గాంధీనే అసలైన ప్రచారకర్త..**

**కేంద్ర మంత్రి సెటైర్లు**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా ప్రజలు భారతీయ జనతా పార్టీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఉద్ఘాటించారు. సోమవారం కరీంనగర్‌లో పర్యటించిన ఆయన, వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభంజనంపై హర్షం వ్యక్తం చేస్తూ విపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించారు.

పశ్చిమ బెంగాల్‌లో ఇన్నాళ్లూ సాగిన అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని బండి సంజయ్ పేర్కొన్నారు. "బంగ్లాదేశ్ చొరబాటుదారులకు అండగా నిలిచిన వారికి దారులు మూసుకుపోయాయి. ప్రధాని మోదీ దార్శనికతపై ప్రజలు నమ్మకంతో బెంగాల్‌లో బీజేపీని ఆశీర్వదించారు" అని ఆయన అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు బలంగా నమ్ముతున్నారని తెలిపారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "రాహుల్ గాంధీ ప్రధాని కావాలని రేవంత్ రెడ్డి కలలు కంటున్నారు. కానీ, సీఎం రేవంత్ ఎక్కడికి వెళ్లి ప్రచారం చేస్తే అక్కడ కాంగ్రెస్‌కు ఓటమే ఎదురవుతోంది" అని ఎద్దేవా చేశారు. కేరళలో కాంగ్రెస్‌కు వచ్చిన ఫలితాలు కేవలం అక్కడి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత వల్లేనని, బీజేపీకి అసలైన స్టార్ క్యాంపెయినర్ రాహుల్ గాంధీనేనని చమత్కరించారు.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ ఫలితాల ట్రెండ్స్‌పై స్పందిస్తూ.. బెంగాల్‌లో బీజేపీ హవా నడుస్తోందని, తమిళనాడులో విజయ్ ఆధిక్యం కనబరుస్తున్న తీరు ఆసక్తికరంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా తదుపరి లక్ష్యం బీజేపీ అధికారమేనని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కరీంనగర్ చేరుకున్న బండి సంజయ్‌కు కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు.

# సోదర విజయ్‌కు అభినందనలు

**తొలి అడుగులోనే భారీ విజయం సాధించడం అభినందనీయం**

**మమతా బెనర్జీకి సానుభూతి.. బీజేపీకి శుభాకాంక్షలు**

**ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్**



**బలగం టీవీ, న్యూఢిల్లీ**

ఎన్నికల ఫలితాల వేళ ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రం తమిళనాడులో నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' కనబరుస్తున్న అసాధారణ ప్రతిభపై ఆయన ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విజయ్‌ను ఉద్దేశించి జగన్ ఒక ఆత్మీయ సందేశాన్ని పోస్ట్ చేశారు.

"నా ప్రియ సోదరుడు విజయ్‌కు హృదయపూర్వక అభినందనలు" అంటూ జగన్ తన పోస్ట్‌ను ప్రారంభించారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తొలి ప్రయత్నంలోనే, అత్యంత ప్రభావవంతమైన పార్టీగా అవతరించడం సామాన్యమైన విషయం కాదని ఆయన కొనియాడారు. "ప్రజాసేవలో మీరు ప్రారంభించిన ఈ కొత్త అధ్యాయంలో మీకు మరింత శక్తి, విజయం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాను. దేవుని ఆశీస్సులు మీకు ఎల్లప్పుడూ ఉండాలి" అని విజయ్‌కు ఆకాంక్షలు తెలిపారు.

మరోవైపు పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల సరళిపై కూడా జగన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అక్కడ అధికార తృణమూల్ కాంగ్రెస్ వెనుకబడి, బీజేపీ ఆధిక్యంలోకి దూసుకుపోతుండటంపై స్పందిస్తూ.. "దీదీ (మమతా బెనర్జీ)కి నా సానుభూతిని తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో గెలుపు బాటలో పయనిస్తున్న భారతీయ జనతా పార్టీకి మరియు ఇతర విజేతలకు ఆయన అభినందనలు తెలిపారు. ఇటు తమిళనాడులో విజయ్ సాధించిన విజయం, అటు బెంగాల్‌లో మారిన రాజకీయ సమీకరణాలపై జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా విజయ్‌ను 'సోదరుడు' అని సంబోధిస్తూ ఆయన చేసిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది.


# బెంగాల్‌లోనూ వికసించిన కమలం: 'మోదీమయ భారత్' అంటూ బీజేపీ ట్వీట్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం దిశగా దూసుకుపోతుండటంతో దేశవ్యాప్తంగా కాషాయ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ఈ కీలక పరిణామంపై స్పందించిన బీజేపీ.. సోషల్ మీడియా వేదికగా లిలి'మోదీమయమైన భారత్'లిలి అంటూ ప్రకటించింది. బెంగాల్ గెలుపు కేవలం ఒక రాష్ట్ర విజయం మాత్రమే కాదని, దేశ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వంపై ఉంచిన అచంచల విశ్వాసానికి నిదర్శనమని పార్టీ పేర్కొంది.

"ఢిల్లీ నుంచి బెంగాల్ వరకు సాగుతున్న ఈ ప్రయాణం కేవలం పార్టీ విస్తరణ కాదు.. ఇది దేశ ప్రగతికి ప్రతిరూపం" అని బీజేపీ తన 'ఎక్స్' (ట్విట్టర్) పోస్ట్‌లో రాసుకొచ్చింది. ఉత్తరాది నుంచి మొదలైన మార్పు ఈశాన్య రాష్ట్రాలను దాటుకుని, ఇప్పుడు పశ్చిమ బెంగాల్ అనే అతిపెద్ద అధ్యాయంతో సరికొత్త శిఖరానికి చేరిందని ఆనందం వ్యక్తం చేసింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్) నిర్మించడమే తమ లక్ష్యమని, ఈ ప్రయాణంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చింది.

ఈ సందర్భంగా బీజేపీ ఒక ఆసక్తికరమైన మ్యాప్‌ను విడుదల చేసింది. ఇందులో బీజేపీ ఒంటరిగా లేదా మిత్రపక్షాలతో కలిసి అధికారంలో ఉన్న రాష్ట్రాలను కాషాయ రంగుతో చూపించింది. అధికారంలో ఉన్న రాష్ట్రాలు:లిలి హర్యానా, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బీహార్, అస్సాం సహా ఈశాన్య రాష్ట్రాలన్నీ కాషాయ రంగులో మెరిసిపోతున్నాయి.ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు:లిలి తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్ వంటి కొన్ని రాష్ట్రాలు మినహా దేశమంతా మోదీ ప్రభంజనం స్పష్టంగా కనిపిస్తోందని మ్యాప్ ద్వారా వివరించింది.






# అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి
- పాత బస్టాండ్ వద్ద కాలిపోయిన దుకాణాల పరిశీలన
- ప్రభుత్వం ద్వారా ఐరన్ షెడ్ల నిర్మాణం, పరిహారానికి హామీ

**బలగం టీవీ, కామారెడ్డి**

కామారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాద బాధితులను కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి పరామర్శించారు. సోమవారం ఆయన కౌన్సిలర్ల బృందంతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి, నష్టపోయిన పూల, పండ్ల వ్యాపారులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని భరోసా కల్పించారు.

శనివారం (మే 2) అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా చెలరేగిన మంటలకు పాత బస్టాండ్ సమీపంలోని 22 దుకాణాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారులు భారీగా స్టాక్ నిల్వ చేసుకున్నారు. ఈ ప్రమాదంలో సామాగ్రితో పాటు దుకాణాల నిర్మాణాలు కూడా ధ్వంసం కావడంతో వ్యాపారులు లక్షల్లో నష్టపోయారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.

బాధిత 22 దుకాణదారుల పూర్తి వివరాలను సేకరించి నివేదిక అందించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అప్పటివరకు కాలిపోయిన వస్తువులను తొలగించి, ఆ స్థలాన్ని చదును చేయాలని సూచించారు.

బాధిత వ్యాపారులకు సాధ్యమైనంత త్వరగా ప్రభుత్వం తరపున ఐరన్ షెడ్ల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. "నిరుపేద వ్యాపారులు తమ ఉపాధిని కోల్పోవడం దురదృష్టకరం. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం అందేలా నా వంతు పూర్తి కృషి చేస్తా" అని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, కౌన్సిలర్లు మరియు బాధిత వ్యాపారులు ఉన్నారు.



# మారుతి నామస్మరణతో పులకించిన గోదావరిఖని

- కోదండ రామాలయంలో 24 గంటల హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభం
- లోక కల్యాణార్థం భక్తుల సామూహిక పూజలు

**బలగం టీవీ, గోదావరిఖని**

రామగుండం పారిశ్రామిక ప్రాంతం మారుతి నామస్మరణతో మారుమోగుతోంది. నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ కోదండ రామాలయంలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ చేపట్టిన లిలి24 గంటల సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంలిలి సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. భక్తి శ్రద్ధల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

పారాయణానికి ముందుగా ఆలయంలోని ఆంజనేయస్వామి వారికి అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు, గురుస్వాములు మరియు హనుమాన్ మాలధారులు కలిసి చాలీసా పారాయణాన్ని ప్రారంభించారు. సమాజంలో ఉన్న ప్రతికూల శక్తులు నశించి, ప్రజలందరి కష్టాలు తొలగిపోవాలని కోరుకుంటూ భక్తులు ఏకధాటిగా స్వామిని స్మరిస్తున్నారు. రేపటి వరకు అత్యంత నియమ నిష్ఠలతో కొనసాగే ఈ పారాయణంలో పారిశ్రామిక ప్రాంతంలోని మాలధారులు, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

ఆలయ ఈవో ఆదేశాల మేరకు సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, అశోక్ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ వంటి సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు. రామ భక్తులు, హనుమాన్ మాలధారుల రాకతో కోదండ రామాలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# లక్ష్మీనరసింహుడికి భక్తుల జయజయధ్వానాలు

- యాదగిరిగుట్టకు పోటెత్తిన జనం
- వేసవి సెలవులు, సెలవు దినం కావడంతో భారీగా పెరిగిన రద్దీ
- స్వామివారికి రూ. 41.81 లక్షల ఆదాయం

**బలగం టీవీ, యాదగిరిగుట్ట**

వేసవి సెలవుల ప్రభావం, దానికి తోడు ఆదివారం సెలవు దినం కావడంతో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో కొండపై ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.

సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ధర్మ దర్శనానికి (ఉచిత దర్శనం) సుమారు 2 గంటల సమయం పడుతుండగా, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సిబ్బంది ముందస్తు ఏర్పాట్లు చేశారు.

ప్రధానాలయం మొదలుకొని వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద టికెట్ కౌంటర్లు, విక్రయశాలల వద్ద భక్తుల రద్దీ స్పష్టంగా కనిపించింది. మాడ వీధులు గోవింద నామస్మరణతో మారుమోగాయి. కొండ కింద పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో నిండిపోయాయి.

భక్తుల రాకతో ఆలయ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదాల విక్రయం, దర్శన టికెట్లు, పూజా కైంకర్యాలు తదితర అన్ని విభాగాల ద్వారా మొత్తం రూ. 41,81,364 (నలభై ఒక్క లక్షల ఎనభై ఒక్క వేల మూడు వందల అరవై నాలుగు రూపాయల) ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో జే.భవానీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజలు మార్పు కోరుకున్నారు: శశిథరూర్

**బలగం టీవీ, న్యూఢిల్లీ**



కేరళ ఫలితాలపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ హర్షం వ్యక్తం చేశారు. "కేరళ ప్రజలు మార్పును ఆకాంక్షించారు. మేము ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాలు వస్తున్నాయి" అని వ్యాఖ్యానించారు. ఇక ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై స్పందిస్తూ.. తమ పార్టీలో సమర్థులైన నేతలకు కొదువలేదని, గెలిచిన ఎమ్మెల్యేలతో చర్చించి హైకమాండ్ తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**యూడీఎఫ్ శిబిరంలో సంబరాలు:**

పదేళ్ల తర్వాత తిరిగి అధికారంలోకి వస్తుండటంతో కేరళ వ్యాప్తంగా యూడీఎఫ్ కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు. డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేలుళ్లతో కాంగ్రెస్ కార్యాలయాలు కళకళలాడుతున్నాయి. ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి సాధించిన విజయాన్ని తుడిచిపెడుతూ, యూడీఎఫ్ మళ్లీ పగ్గాలు చేపట్టనుండటంతో కేరళ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైంది.

మలయాళ గడ్డపై రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోయింది. ప్రతి ఐదేళ్లకోసారి అధికారం మార్చే తన సంప్రదాయాన్ని కేరళ ఓటరు మరోసారి నిలబెట్టుకున్నాడు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఖణఖీ) ప్రభంజనం సృష్టిస్తోంది. మొత్తం 140 స్థానాలకు గాను యూడీఎఫ్ ఏకంగా 99 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ, స్పష్టమైన మెజారిటీ దిశగా దూసుకుపోతోంది.



# రూ.15,660 కోట్లకు రాజస్థాన్ రాయల్స్ జట్టు అమ్మకం!

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టును ఇటీవలే ఆదిత్య బిర్లా గ్రూప్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే కోవలో రాజస్థాన్ రాయల్స్ జట్టు చేరింది. ఈ టీమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలీయనీర్ లక్ష్మీ నివాస్ మిట్టల్ ముందుకొచ్చారు. ఈ టీమ్‌లోని 75 శాతం వాటాను మిట్టల్ ఫ్యామిలీ సొంతం చేసుకోవడంతో.. ఆ ఫ్రాంచేజీ మేనేజ్‌మెంట్ మిట్టల్ ఫ్యామిలీ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ జరుగుతుండగానే ఈ అమ్మకం జరగడం విశేషం. రాజస్థాన్ రాయల్స్ జట్టు ఈ సీజన్‌లో బాగా రాణిస్తుంది. ఈ లీగ్‌లో ఇప్పటివరకు ఆడిన 10 మ్యాచ్‌ల్లో ఆరు మ్యాచ్‌ల్లో గెలిచిన ఈ జట్టు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. రాజస్థాన్ రాయల్స్ జట్టుకు కొత్త యజమానిగా భారత సంతతికి చెందిన బిలియనీర్, స్టీల్ కింగ్‌గా పేరుగాంచిన లక్ష్మీ మిట్టల్ కుటుంబం, రాజస్థాన్ రాయల్స్‌ను సొంతం చేసుకుంది. అయితే రాజస్థాన్ రాయల్స్ టీమ్‌లో 75 శాతం వాటాను మిట్టల్ ఫ్యామిలీ రూ.15,660 కోట్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం అందుతోంది. బిలియనీర్ లక్ష్మీ మిట్టల్ కుటుంబం, దేశంలో 'వ్యాక్సిన్ కింగ్'గా పేరుగాంచిన సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ ఆదర్ పూనావాలాతో కలిసి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. నివేదికల ప్రకారం.. ఐపీఎల్ జట్టు ఒప్పందం పూర్తయిన తర్వాత, రాజస్థాన్ రాయల్స్‌లో మిట్టల్ కుటుంబం సుమారు 75% మెజారిటీ వాటాను కలిగి ఉంటుంది. అయితే ఆదర్ పూనావాలా సుమారు 18% వాటాను కలిగి ఉంటారు. మిట్టల్-పూనావాలా సంయుక్తంగా ఈ ఒప్పందాన్ని పూర్తి చేశారు. మిగిలిన వాటాను ఇతర పెట్టుబడిదారులు కలిగి ఉంటారు. స్టీల్ కింగ్ బిలియనీర్ లక్ష్మీ మిట్టల్ ఆర్సెలార్ మిట్టల్ వ్యవస్థాపకుడు. ఆదర్ పూనావాలాతో కలిసి మిట్టల్ కుటుంబం, మనోజ్ బాజ్‌పేయ్, అతని గ్రూప్ నుండి రాజస్థాన్ రాయల్స్‌ను స్వాధీనం చేసుకుని, అందులో నియంత్రణ వాటాను పొందేందుకు అంగీకరించింది. ఈ ఒప్పందం విలువ సుమారు ￡1.65 బిలియన్లు (సుమారు రూ.15,660 కోట్లు) నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ సేల్‌తో రాజస్థాన్ రాయల్స్ మేనేజ్‌మెంట్ బోర్డులో లక్ష్మీ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్-భాటియా, అదర్ పూనావాలా, మనోజ్ బాజ్‌పేయ్ చేరనున్నారు. ఆదిత్య మిట్టల్ లక్ష్మీ మిట్టల్ కుమారుడు కాగా, వనిషా మిట్టల్-భాటియా ఆయన కుమార్తె. భారత క్రికెట్ నియంత్రణ మండలి, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్, ఇతర నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి, ఈ ఒప్పందం 2026 మూడవ త్రైమాసికంలో అనగా ప్రస్తుత ఐపీఎల్ పూర్తవ్వగానే ఈ డీల్ ఖరారు అవుతుందని భావిస్తున్నారు.

# వన్డే టీమ్ నుంచి పంత్ ఔట్!

**బలగం టీవి, హైదరాబాద్**



ఈ ఏడాది ప్రారంభంలో టీమ్‌ఇండియా చివరిసారిగా న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌లో రిషబ్ పంత్‌ను జట్టులోకి తీసుకున్నారు. కానీ పక్కటెముకల గాయం కారణంగా సిరీస్ ప్రారంభానికి ముందే అతను వైదొలగాల్సి వచ్చింది. అయితే ప్రస్తుతం వన్డే జట్టు నుంచి రిషభ్ పంత్ తన స్థానాన్ని కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. అతని స్థానంలో సంజూ శాంసన్ లేదా ధ్రువ్ జురెల్‌ను వికెట్ కీపర్‌గా పరిశీలించే అవకాశం ఉంది. ప్రస్తుతం జరుగుతోన్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో పంత్ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న క్రమంలో సంజూ శాంసన్ బ్యాటర్‌గా వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాడు. ఇదే సీజన్‌లో రెండు సార్లు సెంచరీలు చేసిన శాంసన్.. చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో ధోనీ తర్వాత ప్రధాన కీపర్‌గా తన స్థానాన్ని పదిల పరుచుకున్నాడు. భారత్ చివరిసారిగా జనవరిలో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడింది. ఆ సిరీస్‌లో పంత్‌ను జట్టులోకి తీసుకున్నారు, కానీ పక్కటెముకల గాయం కారణంగా సిరీస్ ప్రారంభానికి ముందే అతను వైదొలగాల్సి వచ్చింది, అతని స్థానంలో జురెల్‌ను ఎంపిక చేశారు. పంత్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ పంత్ ఇప్పుడు మరోసారి ఎంట్రీ ఇచ్చింది. అయితే, అతను ఎనిమిది ఇన్నింగ్స్‌లలో 145.79 స్ట్రైక్ రేట్‌తో కేవలం 189 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇప్పటి వరకు ఒక్క హాఫ్ సెంచరీ కూడా నమోదు కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరపున శాంసన్ ప్రదర్శనలతో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. అతను ఎనిమిది మ్యాచ్‌లలో రెండు సెంచరీలతో సహా 304 పరుగులు చేశాడు. టీ20 ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించడంతో అతని అద్భుతమైన ఫామ్ కొనసాగింది. ఇటీవలే జరిగిన టీ20 వరల్డ్ కప్‌లో అతను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా ఎంపికయ్యాడు. మరోవైపు రిషబ్ పంత్ తన చివరి వన్డేను ఆగస్టు 2024లో ఆడాడు. అతను ఈ ఫార్మాట్‌లో 27 ఇన్నింగ్స్‌లలో 33.50 సగటుతో 871 పరుగులు రాబట్టాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. శాంసన్ 16 వన్డేలు ఆడి, ఒక సెంచరీ, ఆరు హాఫ్ సెంచరీలతో సహా 56.66 అద్భుతమైన సగటుతో 510 పరుగులు సాధించాడు. అతను ఆడిన చివరి వన్డే డిసెంబర్ 2023లో దక్షిణాఫ్రికా పర్యటనలో జరిగింది. అక్కడ అతను 78 పరుగుల విజయంతో పాటు 114 బంతుల్లో 108 పరుగులు చేశాడు.



# ప్రారంభమైన బిలీవర్స్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

## పాల్గొన్న పాస్టర్లు వివిధ పార్టీలను నాయకులు

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో క్రిస్టియన్ బిలీవర్స్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటును ది రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటి రోజు కోనరావుపేట డేవిడ్ వారియర్స్ వర్సెస్ గొల్లపల్లి, రెండవ మ్యాచ్ కోనరావుపేట గ్రేస్ వర్కర్స్ వర్సెస్ కోనరావుపేట గ్రేస్ టీం విజయం సాధించింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ క్రీడాలు స్నేహభావం పెంపొందించేందుకు ఎంతగానో దాహదపడతాయని అన్నారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా క్రిస్టియన్ బిలీవర్స్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని వివిధ పార్టీల నాయకులు అన్నారు. ది రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కూడా ఇలాగే క్రీడాలు జరిపించాలని పలువురు పాస్టర్లు కోరారు. ఈ కార్యక్రమంలో ది రాజేష్ ఫౌండేషన్ చైర్మన్ రాజేష్, ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎనగందుల నరసింహులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సబేరా బేగం గౌస్ బాయ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, పాస్టర్స్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, గుండాడి రాంరెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ లు బాల్రెడ్డి, కొర్రి అనిల్ కుమార్, పాస్టర్లు అబ్రహం, ఏసుదాస్, మధుబాబు, దేవరాజు, ప్రభుదాస్, నతానియల్, జోసెఫ్, దేవనందు, ఆర్గనైజర్లు కులేరి కిషోర్ కుమార్, దీప్తి కుమార్, శేఖర్, దానియేల్, సింగారం మధు, తదితరులు పాల్గొన్నారు

# స్వదేశం వెళ్లిపోయిన ఫిల్ సాల్ట్

**బలగం టీవి, హైదరాబాద్**



ఐపీఎల్ 2026 సీజన్‌లో వరుస విజయాలతో జోరుమీదున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బిగ్ షాక్ తగిలింది. వేలి గాయంతో బాధపడుతున్న ఆ జట్టు విధ్వంసకర ఓపెనర్ ఫిల్ సాల్ట్ స్వదేశం వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గత ఏప్రిల్ 18న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫిల్ సాల్ట్ చేతి వేలికి గాయమైంది.డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ బౌండరీ వద్ద బంతిని ఆపేందుకు డైవ్ చేసినప్పుడు ఫిల్ సాల్ట్ ఎడమచేతి వేలికి తీవ్ర గాయమైంది. ఈ గాయంతో అతను ఇప్పటికే మూడు మ్యాచ్‌లకు దూరంగా ఉన్నాడు. ఫిల్ సాల్ట్ గాయం తీవ్రతపై ఆర్‌సీబీ ఇప్పటి వరకు అధికారిక ప్రకటన చేయలేదు. అయితే మెరుగైన వైద్యం కోసం అతను యూకే వెళ్లినట్లు తెలుస్తోంది.అతను తిరిగి వచ్చే విషయంపై ఎలాంటి క్లారిటీ లేదు. ఈ సీజన్ ఆరంభంలో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడిన ఫిల్ సాల్ట్ ఆ తర్వాత టచ్‌లోకి వచ్చి విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 6 ఇన్నింగ్స్‌ల్లో 168.33 స్ట్రైక్‌రేట్‌తో 202 పరుగులు చేశాడు. ముఖ్యంగా విరాట్ కోహ్లీతో కలిసి పవర్ ప్లేలో మెరుపు ఆరంభాన్ని అందిస్తున్నాడు. సాల్ట్ గైర్హాజరీలో జాకోబ్ బెతెల్ బరిలోకి దిగుతున్నా.. అతను ఇప్పటి వరకు చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. దాంతో కోహ్లీపై అదనపు ఒత్తిడి పడి ఆర్‌సీబీ బ్యాటింగ్ ఆర్డర్‌పై ప్రభావం చూపుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఆర్‌సీబీకి ఫిల్ సాల్ట్ గైర్హాజరీ పెద్ద ఎదురుదెబ్బగా మారింది. జాకోబ్ బెతెల్ రూపంలో మంచి ప్రత్యామ్నాయం ఉన్నా.. అతను ఇంకా తన సత్తా చూపించలేదు.గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో ఆర్‌సీబీ పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ అనంతరం ఆర్‌సీబీకి 6 రోజుల విశ్రాంత లభించగా.. ఆర్‌సీబీ ఆటగాళ్లు సేద తీరుతున్నారు. కొందరు తమ స్వస్థలాలకు వెళ్లగా.. మరికొందరు మాల్దీవ్స్‌కు వెళ్లారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మే7న జరిగే తమ తదుపరి మ్యాచ్‌లోపు తిరిగి జట్టులో చేరనున్నారు.

# టీ-20 వరల్డ్ కప్ జట్టుకు శ్రీచరణి ఎంపిక

**బలగం టీవి, హైదరాబాద్**




యువ క్రికెటర్ శ్రీచరణి టీ-20 వరల్డ్ కప్ జట్టుకు ఎంపికైంది. ఈ ఏడాది జూన్ 12 నుంచి ఇంగ్లండ్‌లో మహిళల టీ-20 ప్రపంచకప్ జరగనుంది. కడప జిల్లా వీఎన్‌పల్లె మండలం ఎర్రమల్లపల్లె గ్రామానికి చెందిన శ్రీచరణి గతేడాది ఉమెన్స్ వరల్డ్‌కప్‌లో భారత మహిళా జట్టు తరపున అన్ని మ్యాచ్‌ల్లో ప్రతిభ కనబరచింది. కీలక సమయాల్లో ప్రత్యర్థుల వికెట్లు కూల్చడంతో పాటు పరుగులివ్వకుండా కట్టడి చేసి కోట్లాది అభిమానులను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో ఉమెన్స్ టీ-20 వరల్డ్ కప్‌కు జట్టులో మళ్లీ చోటు దక్కించుకోవడంపై జిల్లా క్రికెట్ అసోసియేషన్‌తో పాటు జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.భారత జట్టులో స్థానం దక్కించుకోవడం చాలా మంది కలగా భావిస్తుంటారు. అలాంటిది ఏకంగా ప్రపంచకప్ బరిలో దిగే అవకాశం వస్తే ఎలా ఉంటుందో కదా! అందులోనూ అరంగేట్రం చేసిన కొన్ని నెలలకే ఈ అవకాశాన్ని దక్కించుకుంది తెలుగమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి. వచ్చిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకున్న ఈ స్పిన్నర్ భారత మహిళా జట్టు తొలిసారిగా వరల్డ్ కప్ గెలవడంలో కీలకపాత్ర పోషించింది. కడపకు చెందిన 21 ఏళ్ల శ్రీచరణి మొదట బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖో ఖో క్రీడాకారిణి. క్రికెట్ ఆటకు ఉన్న క్రేజ్ కాస్తా ఆమెను ఇటు వైపు ఆకర్షించింది. ఫాస్ట్ బౌలర్‌గా కెరీర్ ఆరంభించిన శ్రీచరణి అందులో సఫలం కాకపోవడంతో స్పిన్నర్‌గా తనను తాను తీర్చిదిద్దుకుంది. దేశవాళీ పోటీల్లో బంతిని గిరగిరా తిప్పుతూ స్థిరంగా రాణించింది. ఈ నేపథ్యంలో గతేడాది మహిళా ఐపీఎల్?లో ఢిల్లీ క్యాపిటల్స్ శ్రీచరణికి రూ.55 లక్షలు పెట్టి దక్కించుకుంది. ఈ ఏడాది మార్చిలో సీనియర్ మహిళల టోర్నీలో భారత్-బి జట్టు తరపున ఆడినప్పటికీ జాతీయ జట్టుకు ఆడే అవకాశం త్వరగా దక్కడం తన ప్రతిభకు నిదర్శనం అని చెప్పుకోవచ్చు. లెఫ్ట్ ఆర్మ్ బౌలర్ కావడం, ఆడిన ప్రతి మ్యాచ్?లోనూ రాణిస్తుండడంతో భారత్ సీనియర్ జట్టు నుంచి ఆహ్వానం అందుకుని శ్రీలంకపై అరంగేట్రం చేసింది. ప్రపంచకప్ జట్టులో చోటు దక్కించుకోవడం మామూలు విషయం కాదని సీనియర్లు చెప్తుంటారు. ఎంతో మంది సీనియర్లు, కొత్త ప్లేయర్లు రేసులో ఉండడంతో కొత్తగా వచ్చిన శ్రీచరణికి అవకాశం దక్కుతుందని ఎవరూ ఊహించలేదు. సెలక్టర్లు అనుభవం కన్నా నైపుణ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంతో కల నెరవేరింది. తొలిసారిగా ఆడిన అంతర్జాతీయ మ్యాచ్?లో ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీలంక పిచ్‌లపై పట్టు సాధించింది. అత్యధిక వికెట్లు పడగొట్టకున్నా సెలెక్టర్ల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ కీలకంగా మారింది. వరల్డ్ కప్?లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో ఆ జట్టు బ్యాటర్లను కట్టడి చేయడంలో శ్రీచరణి కీలక పాత్ర పోషించింది.బ్యాటర్ల కదలికలను పసిగట్టడం, ప్రతి బంతినీ వైవిధ్యంగా విసరడం శ్రీచరణి ప్రత్యేకత. వ్యూహాత్మకంగా బంతి వేగాన్ని తగ్గించడంతో పాటు ఒక బంతిని స్పిన్ చేసి మరొక బంతిని నేరుగా వేయడం ద్వారా ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేసేది. ఇప్పటిదాకా 17 వన్డేల్లో 22 వికెట్లు పడగొట్టిన శ్రీచరణి ప్రపంచకప్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో దీప్తిశర్మ తర్వాత రెండో స్థానం దక్కించుకుంది. వరల్డ్ కప్?లో 9 మ్యాచ్‌ల్లో 14 వికెట్లు తీసిన చరణి ఇదే జోరు కొనసాగిస్తే భారత్‌కు మరిన్ని విజయాలు అందించడం ఖాయం అని క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# ఐపీఎల్‌లో 'గర్ల్‌ఫ్రెండ్ కల్చర్'పై బీసీసీఐ ఆగ్రహం..!

**బలగం టీవి, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో కొందరు ఆటగాళ్లు తమ గర్ల్? ఫ్రెండ్స్?తో తిరుగుతూ కనిపిస్తున్న ఫోటోలు, వీడియోలు తీవ్ర దుమారానికి దారితీస్తున్నాయి. ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్లేయర్స్? అంతా తమ ప్రియురాళ్లతో కలిసి టీమ్ బస్సుల్లో ప్రయాణిస్తూ, హోటళ్లలో బస చేస్తూ తరచుగా కనిపించడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో బీసీసీఐ చర్చలు జరిపి ఓ కీలక నిర్ణయం తీసుకోవాలని ఆలోచిస్తుందని తెలిసింది. హార్దిక్ పాండ్య, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్, అర్షదీప్ సింగ్ వంటి పలువురు ఆటగాళ్లు తమ స్నేహితురాళ్లతో కలిసి ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో తిరుగుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ వ్యవహారం బీసీసీఐ దృష్టికి చేరడంతో వెంటనే చర్యలపై చర్చ మొదలైనట్లు తెలుస్తోంది. బీసీసీఐ పాలసీ ప్రకారం ఆటగాళ్లతో కలిసి ప్రయాణించడానికి, హోటళ్లలో బస చేయడానికి కేవలం భార్యలు, కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతి ఉంటుంది. అయితే, 'అఫీషియల్ గర్ల్‌ఫ్రెండ్'(అధికారికంగా ప్రకటించిన) అనే పేరుతో కొందరు అనుమతులు పొందుతున్నారన్న వార్తలు బోర్డును ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అసలు ఇలాంటి నిబంధన ఎక్కడి నుంచి వచ్చిందనే అంశంపై బీసీసీఐలోనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కొంతమంది ఆటగాళ్ల భాగస్వాములు సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్లుగా ఉండటం కూడా వివాదానికి దారితీసింది. వారు గతంలో బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినట్లు వచ్చిన ఆరోపణలు బీసీసీఐకి మరింత చిక్కులు తెచ్చాయి. ఇది యాంటీ కరప్షన్ యూనిట్‌కు కూడా ఆందోళన కలిగిస్తున్న అంశంగా మారింది. ఇదే సమయంలో కొందరు ఆటగాళ్లు తమ పార్టనర్స్‌తో వ్యక్తిగత విభేదాలకు దిగినట్లు, పోలీస్ ఫిర్యాదుల వరకూ వెళ్లినట్లు సమాచారం. ఈ పరిణామాలు ఐపీఎల్‌తో పాటు బీసీసీఐ ప్రతిష్ఠపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. "ఇప్పుడే ఈ సంస్కృతికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది. జట్టు బస్సుల్లో కూడా ఆటగాళ్లు తమ గర్ల్‌ఫ్రెండ్స్ కోసం వేచి ఉండే ఘటనలు గమనించాం. ఇలాంటి అంశాలపై సమగ్ర విచారణ అవసరం" అని బీసీసీఐకి చెందిన ఒక అధికారి పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై బీసీసీఐ త్వరలోనే సమగ్ర విచారణ చేపట్టే అవకాశముందని సమాచారం. నిబంధనలు ఉల్లంఘించిన ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకునే దిశగా బోర్డు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఐపీఎల్‌లో ఆటగాళ్ల ప్రవర్తన మరోసారి చర్చనీయాంశంగా మారగా, బీసీసీఐ తీసుకునే నిర్ణయాలు ఇప్పుడు కీలకంగా మారాయి.ఇదిలా ఉండగా ఐపీఎల్ సీజన్? ప్రారంభమవగానే వాటితో పాటు వివిధ రకాల స్కామ్?లు కూడా మొదలవుతాయి. అందులో భాగంగా కొత్తగా ఐపీఎల్ టికెట్ల పేరుతో ఓ



మోసం బయటపడింది. కొందరు మోసగాళ్లు ప్రముఖుల పేర్లతో ఫోన్ కాల్స్, నకిలీ అధికారిక లేఖలను ఉపయోగించి ఐపీఎల్ టికెట్లను సంపాదిస్తున్నారు. ఈ మేరకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఆ మోసాన్ని బట్టబయలు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉప్పల్? స్టేడియంలో టికెట్ల కోసం అశోక్ అనే వ్యక్తి, మరో ఇద్దరితో కలిసి తాము న్యాయమూర్తులు, ఉన్నతాధికారులమంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యవర్గ సభ్యులకు ఫోన్ కాల్స్ చేశారు. పీఎంఓ, గవర్నర్ కార్యాలయం, తమిళనాడు క్రికెట్ అసోసియేషన్, ముంబై క్రికెట్ అసోసియేషన్ పేర్లతో నకిలీ లేఖలు పంపించారు. అలా ఐపీఎల్ మ్యాచ్? టికెట్లు పొందేందుకు ప్రయత్నించారు. అనుమానం వచ్చిన హెచ్‌సీఏ వర్గాలు వర్గాలు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌కు సమాచారం అందించారు. దాంతో స్పెషల్ బ్రాంచ్, ఎస్ఓటీ పోలీసులు, హెచ్‌సీఏ కార్యవర్గసభ్యులతో కలిసి సంయుక్త ఆపరేషన్ చేపట్టారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అశోక్ ఏపీలోని ప్రకాశం జిల్లా కందుకూరు ప్రాంతానికి చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. అతనితో పాటు మరో ఇద్దరు కూడా అదే ప్రాంతానికి చెందినట్లు సమాచారం.

# రీ-ఎంట్రీ ధోనీ నిర్ణయంపైనే ఉంది




## సీఎస్కే యాజమాన్యం స్పష్టత

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్నా సీఎస్కే అభిమానులు మాత్రం తమ ఆరాధ్య దైవం ఎంఎస్ ధోనీ స్టేడియంలోకి ఎప్పుడు వస్తాడా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ సీజన్ ప్రారంభంలోనే పిక్క కండరాల గాయం బారిన పడిన ఎంఎస్ ధోనీ.. ఇప్పటివరకు సీఎస్కే ఆడిన 9 మ్యాచ్‌లలో ఒక్కటి కూడా ఆడలేదు. అయితే తాజాగా ఆయన ఫిట్‌నెస్‌పై సీఎస్కే యాజమాన్యానికి చెందిన ఓ ఉన్నతస్థాయి ప్రతినిధి కీలక విషయాలను వెల్లడించారు.ధోనీ ప్రస్తుతం నెట్స్‌లో వికెట్ కీపింగ్, బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తూ తన పనిభారాన్ని పెంచుకుంటున్నారని జట్టు యాజమాన్యం పేర్కొంది. "ధోనీ తన రీ-ఎంట్రీ కోసం చాలా కష్టపడుతున్నారు. ఆయన శిక్షణపై పూర్తి దృష్టి సారించారు. అయితే ఆయన ఎప్పుడు మ్యాచ్ ఆడతారనేది మాత్రం ఎవరికీ తెలియదు. అది పూర్తిగా ధోనీ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది" అని సీఎస్కే ప్రతినిధి స్పష్టం చేశారు. ఫ్రాంచైజీ యజమాన్యం కూడా ధోనీపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడం లేదని.. ఆయన సిద్ధంగా ఉన్నానని చెబితేనే బరిలోకి దిగుతారని సమాచారం.ఈ సీజన్‌లో ధోనీ లేకపోవడం సీఎస్కే ప్రదర్శనపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో చెన్నై జట్టు 9 మ్యాచ్‌ల్లో కేవలం 4 విజయాలతో ఆరో స్థానంలో ఉంది. ధోనీ లేని మిడిలార్డర్ తడబడుతుండటంతో ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి. జట్టుకు వెన్నెముకగా ఉండే ధోనీ గైర్హాజరీతో పాటు ఆయుష్ మాత్రే, ఖలీల్ అహ్మద్, నాథన్ ఎల్లిస్ వంటి కీలక ఆటగాళ్లు గాయాల పాలుకావడం జట్టును మరింత కష్టాల్లోకి నెట్టింది.మే 5న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో సీఎస్కే తన తదుపరి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా ధోనీ మైదానంలోకి అడుగుపెడతారో లేదో చూడాలి. 19 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో చెన్నైకి 5 టైటిళ్లు అందించి, 10 సార్లు ఫైనల్ చేర్చిన ధోనీని ఈ సీజన్‌లో కనీసం ఒక్కసారైనా పసుపు రంగు జెర్సీలో చూడాలని అభిమానులు కోరుకుంటున్నారు. మ్యాచ్ రోజు టాస్ సమయంలోనే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ :**



పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..వేములవాడ పట్టణంలో సోమవారం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు..

ఈ సందర్భంగా అది శ్రీనివాస్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..

# బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**బలగం టీవీ,గంభీరావుపేట,**

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వారోత్సవాల సందర్భంగా గంభీరావుపేట మండల కేంద్రంలోని బీడీ కంపెనీ వద్ద తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం (బిఎల్ టీయు) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ముద్రకొల ఆంజనేయులు అధ్యక్షతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు ఎస్. సిద్ధిరాములు మాట్లాడుతూ.. 1886 చికాగో పోరాట స్ఫూర్తితో పాటు భారతదేశంలో కార్మిక హక్కుల కోసం పోరాడిన తొలి యోధుడు నారాయణ మేఘాజీ లోఖండే ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

?బీడీ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే 41 జీవోను అమలు చేయాలని, నెలకు 26 రోజుల పని కల్పిస్తూ నాణ్యమైన ముడి సరుకు అందించాలని డిమాండ్ చేశారు. బీడీలపై జీఎస్టీని తొలగించాలని, కటాఫ్ తేదీ నిబంధన తీసివేసి అర్హులైన కార్మికులందరికీ 4,016 రూపాయల జీవన భృతి కల్పించాలని అన్నారు.అలాగే 50 ఏళ్లు దాటిన మహిళా కార్మికులకు 6 వేల రూపాయల పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలతో పాటు మరణించిన కార్మికుల కుటుంబాలకు 7 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# విశ్వంభరలో త్రిష లుక్ విడుదల




మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ ఎపిక్ 'విశ్వంభర' సినిమా ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా నటి త్రిష కృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఆమె క్యారెక్టర్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ పోస్టర్‌లో త్రిష ట్రెడిషనల్ లుక్‌లో డివైన్ ఔరాతో కనిపిస్తూ ఆకట్టుకుంది. అయితే ఇది కేవలం గ్లామర్ పాత్ర మాత్రమే కాదని, కథలో కీలక పాత్ర పోషించబోతుందని స్పష్టమైన సంకేతాలు ఇస్తోంది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, త్రిష పోషిస్తున్న 'అవని' పాత్ర సినిమా కథలో కీలక మలుపులు తీసుకువచ్చే ప్రధాన అంశంగా ఉండనుంది.

ముఖ్యంగా ఈ పాత్ర చుట్టూనే సినిమా నెరేషన్ తిరిగే అవకాశముందని టాక్ వినిపిస్తోంది. ఇప్పటివరకు త్రిష చేసిన పాత్రలతో పోలిస్తే, ఈ పాత్రలో ఎక్కువ ఎమోషనల్ వెయిట్, డెప్త్ ఉండబోతుందని తెలుస్తోంది. కేవలం స్క్రీన్ ప్రెజెన్స్‌కే పరిమితం కాకుండా, కథను ముందుకు నడిపించే డ్రైవింగ్ ఫోర్స్‌గా అవని పాత్ర ఉండటం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. గత కొన్నేళ్లుగా సెలెక్టివ్ ప్రాజెక్ట్స్‌తో ముందుకు సాగుతున్న త్రిషకు 'విశ్వంభర' ఒక స్టాం÷-రగ్ కంబ్యాక్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పాత్ర దక్కడం ఆమె కెరీర్‌కు మరో మైలురాయిగా మారవచ్చని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇక మెగాస్టార్ చిరంజీవి-త్రిష కాంబినేషన్ కూడా ఈ సినిమాకు మరో ప్రధాన హైలైట్. గతంలో వీరిద్దరి మధ్య ఉన్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు సోషియో ఫాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో వారి పాత్రలు ఎలా మలచబడ్డాయో అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రానికి దర్శకుడు వశిష్ట విజువల్ ట్రీట్ ఇవ్వడానికి భారీ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. హాలీవుడ్ స్థాయి వీఎఫ్ఎక్స్ స్టూడియోలు ఈ ప్రాజెక్ట్‌పై పనిచేస్తున్నాయని సమాచారం.

# జైహనుమాన్‌లో అక్షయ్ ఖన్నా ?



టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను హాలీవుడ్ రేంజ్‌లో విస్తరిస్తున్నారు. ప్రస్తుతం అందరి కళ్లు ఆయన ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్న 'జై హనుమాన్'పైనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఈ సినిమాలో ఒక ఆసక్తికరమైన కాస్టింగ్ అప్‌డేట్‌కు సంబంధించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అక్షయ్ ఖన్నా నటనకు ఫిదా అయిన ప్రశాంత్ వర్మ, ఆయనను 'జై హనుమాన్' ప్రాజెక్టులోకి కూడా ఆహ్వానించినట్లు సమాచారం. ఇప్పటికే ప్రశాంత్ వర్మ యూనివర్స్‌లోని 'మహాకాళి' చిత్రంలో అక్షయ్ ఖన్నా 'శుక్రాచార్యుడి' గా కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. అక్షయ్ ఖన్నా పోషించబోయే పాత్రపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 'మహాకాళి'లో ఆయన చేస్తున్న శుక్రాచార్యుడి పాత్రకు, 'జై హనుమాన్'లోని పాత్రకు ఏమైనా లింక్ ఉంటుందా? లేక ఇది సరికొత్త పాత్రనా? అన్నది మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రశాంత్ వర్మ తన యూనివర్స్‌లోని పాత్రలను ఒకదానితో ఒకటి అనుసంధానించడంలో దిట్ట కాబట్టి, అక్షయ్ ఖన్నా ఎంట్రీ ఈ సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్తోంది. కేవలం బాలీవుడ్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొనే కాకుండా, పాత్రకు ఉన్న వెయిటేజ్ కారణంగానే ఆయనను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది. క 'జై హనుమాన్'లో కన్నడ స్టార్, 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి లీడ్ రోల్ హనుమంతుడుగా చేస్తున్న విషయం తెలిసిందే. రిషబ్ శెట్టి లాంటి పవర్‌ఫుల్ పర్ఫార్మర్‌కు తోడు అక్షయ్ ఖన్నా వంటి వెర్సటైల్ యాక్టర్ తోడవ్వడం సినిమాకు పెద్ద అసెట్ కానుంది. ప్రశాంత్ వర్మ విజన్ ప్రకారం, ఈ యూనివర్స్‌లో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది, కాబట్టి అక్షయ్ ఖన్నా రోల్ కూడా కథను మలుపు తిప్పేలా ఉంటుందని టాక్. మొత్తానికి ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్‌ను పాన్-ఇండియా లెవల్‌లో స్టాం÷-రగ్‌గా బిల్డ్ చేస్తున్న తీరు చూస్తుంటే, బాక్సాఫీస్ వద్ద మరో సంచలనం ఖాయమనిపిస్తోంది. 'జై హనుమాన్'లో అక్షయ్ ఖన్నా రోల్‌కు సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# కల్కి-2 షూటింగ్‌లో ప్రభాస్ చేరిక





**ప్రభాస్ అభిమానులతో, సైన్స్ ఫిక్షన్ జోనర్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న**

ప్రాజెక్టుల్లో ఒకటి 'కల్కి 2898 -2' ఫ్రాంచైజీ. ఇప్పటికే ఫస్ట్ పార్ట్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రభాస్-నాగ్ అశ్విన్ టీం ఇక సీక్వెల్‌తో ఎంటర్‌టైన్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసిందే. అయితే సీక్వెల్ ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం ఇప్పటికే అమితాబ్ బచ్చన్ షూట్‌లో పాల్గొన్నట్టు ఆసక్తికర అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. తాజాగా మరో ఆసక్తికర వార్త బయటకు వచ్చింది. హీరో ప్రభాస్ కల్కి సీక్వెల్ షూట్‌లో జాయిన్ అయ్యాడట. ఎక్కువగా నైట్ షూట్స్ ఉండనుండగా.. కొన్ని రోజులపాటు ఈ షెడ్యూల్‌లో పాల్గొనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రభాస్ షూట్‌కు సంబంధించి మేకర్స్ ఏమైనా అప్‌డేట్స్ అందిస్తారేమో చూడాలి. కాగా ఫస్ట్ పార్ట్‌లో దీపికా పదుకొనే పోషించిన సుమతి పాత్ర కోసం సీక్వెల్‌లో ఇంకా ఏ నటిని ÷నైల్ చేయలేదు మేకర్స్. కమల్ హాసన్‌తోపాటు పలువురు కీలక నటీనటులు సీక్వెల్‌లో కనిపించబోతున్నట్టు తెలుస్తుండగా.. మేకర్స్ నుంచి అప్‌డేట్ రావాల్సి ఉంది. భారీ విజువల్ వండర్‌గా మారిన 'కల్కి'లో ప్రభాస్, దీపికా పదుకొణె, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ లాంటి లీడ్‌యాక్టర్లు నటించడంతో ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. భారీ విఎఫ్ఎక్స్, యూనిక్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఫస్ట్ పార్ట్‌ను తెరకెక్కించిన వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సీ అశ్వనీదత్ ఈ చిత్రాన్నినిర్మించనున్నారు.

# సొంత కథతో సిద్ధం అవుతున్న రామ్






దేవదాసుతో వెండితెరకు పరిచయమైన రామ్ తన ఎనర్జీతో, డ్యాన్స్‌తో, యాక్టింగ్‌తో టాలీవుడ్‌ను ఊపేశాడు. లవర్ బాయ్‌గా అమ్మాయిల మనసు గెలిచిన రామ్, ఇస్మార్ట్ శంకర్ తో మాస్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు. కానీ, గడిచిన కొంతకాలంగా రామ్ కెరీర్ ఒక విచిత్రమైన సందిగ్ధంలో పడింది. వరుస ఫ్లాపులు.. అంచనాలు తప్పిన లెక్కలు. ఇప్పుడు వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు రామ్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. రామ్ కెరీర్‌ను ఒకసారి గమనిస్తే.. అటు క్లాస్ సినిమాలతో పాటు, మాస్ సినిమాలతోనూ సత్తా చాటుకున్నారు. ఇక కరోనా కు ముందు వచ్చిన ఇస్మార్ట్ శంకర్ రామ్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ మైల్‌స్టోన్‌గా నిలిచింది. పూరీ జగన్నాథ్ మార్క్ మేనరిజమ్స్‌తో రామ్ ఊరమాస్ అవతారంలో అదరగొట్టాడు. కానీ ఆ తర్వాత వచ్చిన రెడ్, ది వారియర్, స్కంద, చివరకు డబుల్ ఇస్మార్ట్ కూడా ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోయాయి. రీసెంట్ మూవీ ఆంధ్రా కింగ్ కథ పరంగా బాగుందని ప్రశంసలు దక్కించుకున్నా, కమర్షియల్‌గా రామ్‌కు కావాల్సిన పెద్ద బ్రేక్ ఇవ్వలేకపోయింది. దీంతో రామ్ తన కెరీర్ పట్ల పూర్తిస్థాయి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక హీరో వరుస ఫ్లాపుల్లో ఉంటే కొత్త దర్శకుల కోసం వెతుకుతారు. కానీ రామ్ ఆలోచన డిఫరెంట్‌గా ఉంది. తన బలాలు ఏంటి? బలహీనతలు ఏంటి? అనేది ఒక నటుడిగా తనకన్నా బాగా ఇంకెవరికి తెలుస్తుంది అనుకున్నాడట. అందుకే తన తదుపరి సినిమాకు తానే కథను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మొదట కథ ఇచ్చి వేరే దర్శకుడితో చేయిద్దాం అనుకున్నా, చివరి నిమిషంలో మనసు మార్చుకుని మెగాఫోన్ పట్టాలని డిసైడ్ అయ్యాడట. సినిమాల ఎంపికలోనూ, మేకింగ్ ప్రాసెస్‌లోనూ రామ్ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు. ఇప్పుడు అదే అనుభవంతో తన సొంత బ్యానర్ స్రవంతి మూవీస్ లో ఈ భారీ ప్రాజెక్టును తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే టాలీవుడ్‌లో అడవి శేష్, విశ్వక్ సేన్, సిద్ధు జొన్నలగడ్డ వంటి యంగ్ హీరోస్ తమ సొంత కథలతో సక్సెస్ అవుతున్నారు. ఇప్పుడు రామ్ కూడా అదే బాటలో ప్రయాణించి తన ఫేట్‌ను మార్చుకోవాలని చూస్తున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న త్రిష




సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ సోమవారం ఉదయం తిరుమల శ్రీవారి సేవలో పాల్గొని శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంది. సాధారణంగా సెలబ్రిటీలు తిరుమలకు వెళ్లడం కొత్తేమీ కాదు. అయితే ఈసారి త్రిష పర్యటన ప్రత్యేకంగా మారడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి ఆమె పుట్టినరోజు కావడం, మరొకటి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఇదే రోజున వెలువడటం. తిరుమలలో త్రిష దర్శనానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. పుట్టినరోజు సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చినట్లు కొందరు భావిస్తుండగా, మరికొందరు దీని వెనుక రాజకీయ కోణం కూడా ఉందని అంటున్నారు. ఇటీవల తమిళనాడు రాజకీయాల్లోకి అడుగుపెట్టిన స్టార్ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేసింది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్‌లో ఈ పార్టీకి అనుకూల ఫలితాలు రావచ్చన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ పార్టీ విజయాన్ని కోరుకుంటూ త్రిష తిరుమలకు వచ్చిందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. ఇక గత కొంతకాలంగా విజయ్, త్రిష మధ్య వ్యక్తిగత సంబంధంపై కూడా రూమర్లు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల మధ్య త్రిష ఈ సమయంలో తిరుమల రావడం మరింత చర్చనీయాంశంగా మారింది.అయితే మరోవైపు, ఇది పూర్తిగా వ్యక్తిగత ఆధ్యాత్మిక పర్యటన మాత్రమేనని కొందరు అభిప్రాయ పడుతున్నారు. తన పుట్టినరోజు సందర్భంగా శ్రీవారిని దర్శించుకోవడం కోసం త్రిష తిరుమలకు వచ్చిందని, ఇందులో ఇతర అర్థాలు వెతకాల్సిన అవసరం లేదని అంటున్నారు. మొత్తానికి తమిళనాడు ఎన్నికల ఫలితాల ఉత్కంఠ మధ్య త్రిష తిరుమల పర్యటన ట్రెండింగ్ టాపిక్‌గా మారింది. ఇక విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఈ ఎన్నికల్లో ఎలా ప్రదర్శన చేస్తుందో మరికొన్ని గంటల్లో స్పష్టత రానుంది.

## ఆదిత్యరాయ్‌తో డేటింగ్‌లో

# సుతారియా



బాలీవుడ్ లో ఇప్పుడు సినిమాల కంటే స్టార్ల వ్యక్తిగత జీవితాల చుట్టూనే ఎక్కువగా వార్తలు నడుస్తున్నాయి. మరీ ముఖ్యంగా హీరోహీరోయిన్ల డేటింగ్‌కు సంబంధించి, ఏ చిన్న టాపిక్ వచ్చినా.. అది సెన్సేషన్‌గా మారుతోంది. గతంలో ఇలాంటి డేటింగ్ వ్యవహారాల అనంతరం సెలబ్రిటీలు కొందరు మ్యారేజ్ చేసుకున్న వారు కూడా ఉన్నారు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఇలాంటి విషయాలు కామన్‌గా మారిపోరాయి. ఇప్పుడీ కామన్ పాయింట్‌లోకి మరో కొత్త జంట వచ్చి చేరారు. 'ఆషికీ2', 'ఓకే జాను' చిత్రాల ఫేమ్ ఆదిత్య రాయ్ కపూర్.. 'తడప్', 'హీరోపంతి 2' ఫేమ్ తారా సుతారియా డేటింగ్‌లో ఉన్నారంటూ బాలీవుడ్ మీడియా సర్కిల్స్‌లో వార్తలు సెన్సేషన్‌గా మారాయి. బాలీవుడ్‌లోని ప్రధాన మీడియా సంస్థలు వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారని అధికారికంగా ధృవీకరించడంతో.. సోషల్ మీడియాలో వారిద్దరి గురించే డిస్కషన్ నడుస్తోంది. ఇటీవల జరిగిన పలు సినీ వేడుకలు, ప్రైవేట్ పార్టీల్లో వీరిద్దరూ జంటగా కనిపించడంతో అభిమానులకు ముందే అనుమానం వచ్చింది. కొన్నిరోజులుగా వీరి రిలేషన్‌పై వార్తలైతే వినిపిస్తున్నాయి కానీ, అధికారికంగా ఎక్కడా రివీల్ కాలేదు. ఇప్పుడు ప్రధాన మీడియా సంస్థలే కన్ఫర్మ్ చేయడంతో.. ఇద్దరి మధ్య రిలేషన్ నిజమే అనేలా ఫ్యాన్స్ కూడా ఫిక్స్ అవుతున్నారు. ఇద్దరు నటులు తమ వ్యక్తిగత విషయాలను గోప్యంగా ఉంచినప్పటికీ, వరుసగా జంటగా కనిపిస్తుండటం మాత్రం వారి మధ్య ఏదో ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. 2026 ప్రారంభంలో ముంబైలో తారా సుతారియా తన కొత్త ఇంటికి మారిన సమయంలోనూ ఈ జోడీ సందడి చేయడం విశేషం. సోషల్ మీడియాలో నెటిజన్లు వీరిని 'పవర్ కపుల్' అంటుంటే.. వీరి క్లాసిక్, సైలెంట్ పర్సనాలిటీలు ఒకరికొకరు పర్ఫెక్ట్‌గా సెట్ అవుతాయని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ చేతినిండా అవకాశాలతో బిజీ బిజీగా ఉన్నారు. యష్ 'టాక్సిక్'లో తారా సుతారియా ఓ కీలక పాత్రను పోషిస్తోన్న విషయం తెలిసిందే. ఆదిత్య రాయ్ కపూర్ విషయానికి వస్తే.. ఇంతకు ముందు అనన్యా పాండేతో పాటు పలువురితో ప్రేమాయణం నడపగా, తారా సుతారియా కూడా వీర్‌తో కొన్నాళ్లపాటు డేటింగ్‌లో ఉన్నట్లుగా టాక్ నడిచిన విషయం తెలిసిందే.